


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం17-12-2022 సంపుటి : 04 సంచిక : 103 పేజీలు : 4 వెల : రూ 3-00


## సీఎం జగన్ సమీక్ష.. మాజీ మంత్రి కన్నబాబు ఏమన్నారంటే?

తాడేపల్లి: గడప గడపకు మన ప్రభుత్వంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు.అనంతరం మాజీ మంత్రి కురసాల కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ, ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలని సీఎం చెప్పారని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులకు ప్రజలకు వివరించాలని, సచివాలయం పరిధిలో ముగ్గురు కన్వీనర్ల నియామకం త్వరగా పూర్తి చేయాలని సీఎం సూచించారని



కన్నబాబు అన్నారు."గృహ సారధుల నియామకం కూడా జరగాలి. దాని వ్యవస్థీకృతం చేయాలని సీఎం చెప్పారు. గడప గడపకు కార్యక్రమంపై నిర్లక్ష్యం వద్దని సీఎం చెప్పారు. కొందరు ఎమ్మెల్యేలు తక్కువ రోజులు గడప గడప చేశారు. మార్చి నాటికి పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. వచ్చే మార్చిలో వర్క్‌షాప్ ఉంటుందని చెప్పారు. ఈలోగా వెనుకబడిన వారి పనితీరు మార్చుకోవాలని సూచించారు." అని కన్నబాబు పేర్కొన్నారు.

## 'మార్గదర్శి' అవకతవకలపై సీబీఐ విచారణకు సిద్ధమా?: మంత్రి కాకాణి

తాడేపల్లి: ఎల్లో మీడియా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తోందని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు.శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, అడ్డగోలు రాతలు రాయడం ఎల్లో మీడియాకు అలవాటైపోయిందన్నారు." నైతిక విలువల గురించి మాట్లాడే హక్కు రామోజీకి లేదు. మార్గదర్శిపై రామోజీరావు పిటీషన్ వేయడం హాస్యాస్పదం. మార్గదర్శిలో ఏపీ స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ తనిఖీలు చేయొద్దా?. మార్గదర్శిలో అవకతవకలపై సీబీఐ విచారణకు సిద్ధమా?. దమ్ముంటే మార్గదర్శిలో అవకతవకలు జరగలేదని నిరూపించుకోవాలి" అంటూ మంత్రి సవాల్ విసిరారు."దోచుకునేందుకు చంద్రబాబు కంటే రామోజీకి ఎక్కువ ఆత్రంగా ఉంది. మేం రాసిందే రాత అని రామోజీరావు అనుకుంటే అది భ్రమే. చంద్రబాబును మళ్లీ సీఎం చేయాలనేదే రామోజీ తాపత్రయం. రామోజీ బెదిరింపులకు భయపడే వ్యక్తిని కాను" అని మంత్రి కాకాణి అన్నారు.



# 175 నియోజకవర్గాల్లో రక్తదాన శిబిరాలు.. రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు



తాడేపల్లి:ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని ప్రభుత్వ సలహాదారు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించారు.తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన రక్తదానంకు సంబంధించి ప్రత్యేక వెబ్ సైట్ )ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 19న క్రీడా పోటీలు, మహిళలకు సంబంధించిన పోటీలు, 20న మొక్కలు నాటడం, 21న రక్తదాన శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. అదే రోజు కేక్ కటింగ్, సర్వమత ప్రార్ధనలు,సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వేడుకలలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.సుస్థిరమైన అభివృద్ధి సంక్షేమం దిశగా రాష్ట్రాన్ని మూడున్నరేళ్ల కాలంలోనే తీసుకువెళ్లి చరిత్రలో నిలిచిన ఘనత సీఎం జగన్‌ది అని సజ్జల అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి, ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను మూడున్నరేళ్ళలోనే 99 శాతం పూర్తి చేశారన్నారు. ఇచ్చిన హామీలకంటే వంద రెట్లు ఎక్కువగా పథకాలు అమలు చేశారన్నారు.రాష్ట్రంలో అట్టడుగున ఉన్న బలహీనవర్గాలు ఆర్థికంగా బలపడేలా చేయడంతోపాటు వారికి విద్య, వైద్యపరంగాను, ఉపాధి మెరుగైన సేవలు అందించారన్నారు. వీటన్నింటికి మించి పొలిటికల్ ఎంపవర్మెంట్ చేసి చూపించారన్నారు. వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా రాష్ట్రవ్యాప్తంగా జరుపుకోవాలని భావించామన్నారు. ప్రతిసారి పార్టీ తరఫున చేస్తుంటాం. ఈసారి కోట్లాది మంది అభిమానులతోపాటు సంక్షేమ పథకాల లబ్ధిదారులు వారి కుటుంబసభ్యులు కూడా పాల్గొంటారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళాపక్షపాత ప్రభుత్వం, వారికి పెద్దపీట వేశారన్నారు.2020లో రికార్డుస్థాయిలో 38 వేల యూనిట్లు రక్తదానం చేసినట్లు సజ్జల తెలిపారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు,ప్రజలు అందరూ శిబిరాలకు వచ్చి రక్తదానం చేశారు. తమ నాయకుడైన సీఎం జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేస్తూ మరోవైపు తమ భాధ్యతగా అవసరమైనవారికి రక్తం ఇవ్వాలనే మహోన్నత ఆశయంతో ఆనాడు రక్తదానం చేశారన్నారు. అప్పుడు కూడా రెడ్ క్రాస్, వైఎస్సార్‌సీపీ కలిసి రక్తదాన కార్యక్రమం నిర్వహించాయన్నారు.ఆ రోజున బ్లడ్ ఎక్కువ కాలం స్టోర్ చేశారు. నిజంగా అవసరమైనప్పుడు ఇస్తే బాగుంటుందనే భావించామన్నారు. అందుకే ఈసారి ఫిజికల్‌గా రక్తదాన శిబిరాలు నిర్వహించడంతో పాటు వెబ్ సైట్ కూడా లాంచ్ చేశాం అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు, ఇతర రాష్ట్రాల్లోనూ, విదేశాలలోను ఎవరికైతే రక్తం అవసరం ఉంటుందో వారికి అది అందేలా చేయడం ఈ వెబ్ సైట్‌వల్ల వీలు కలుగుతుంది. కార్యకర్తలు, అభిమానులు తమ నాయకుడికి జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియచేయడంతోపాటు సామాజిక బాధ్యత నెరవేర్చినట్లు అవుతుందన్నారు. వివిధ కాలేజీలు, సంస్థలు అందరూ కూడా ప్రమోట్ చేయాలని కోరుతున్నామన్నారు. తలసేమియా లాంటి వ్యాధిగ్రస్తులకు రక్తం ఎంతో అవసరం అన్నారు.రెడ్ క్రాస్ స్టేట్ కోఆర్డినేటర్ కుమార్ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ జన్మదినాన్నిపురస్కరించుకుని విదేశాలలో, ఇతర రాష్ట్రాల్లో కూడా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు రెడ్ క్రాస్ మన రాష్ట్రంలో మాత్రమే ఇలాంటి కార్యక్రమం నిర్వహించిందన్నారు. 2020లో కూడా రెడ్ క్రాస్ ద్వారా రక్తదానశిబిరాల ద్వారా 38 వేల యూనిట్లు రక్తాన్ని సేకరించామన్నారు. ఇప్పుడు బ్లడ్ కలెక్ట్ చేయడమే కాకుండా ప్లెడ్జ్ ఫామ్స్ కూడా తీసుకుంటున్నాం. ఆన్ లైన్ లో కూడా ఇవ్వచ్చు లేదా రక్తదానశిబిరాల వద్దకు వచ్చి ఈ ఫామ్స్ ఇవ్వచ్చని తెలియచేశారు. అత్యవసర పరిస్థితులలో రక్తం అవసరమైనప్పుడు మేము సేకరించే డేటా ద్వారా రక్తదాతల ద్వారా అవసరమైనవారికి సహాయం అందిస్తామన్నారు. 175 నియోజకవర్గాల వారీగా సేకరిస్తున్నామని తద్వారా ఆయా ప్రాంతాలలో రక్తదాతలు అందుబాటులో ఉంటారన్నారు.కార్యక్రమంలో సాంఘికసంక్షేమశాఖమంత్రి మేరుగ నాగార్జున, శాసనమండలి సభ్యులు, పార్టీ కేంద్ర కార్యాలయం పర్యవేక్షకులు లేళ్ళఅప్పిరెడ్డి, ప్రభుత్వ సలహాదారులు చల్లా మధుసూధన్‌రెడ్డి, నారమల్లి పద్మజ, పార్టీ సోషల్ మీడియా విభాగం అధ్యక్షులు సజ్జల భార్గవ్, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## పనితీరు మార్చుకోండి.. 32మంది ఎమ్మెల్యేలకు సీఎం జగన్ వార్నింగ్



అమరావతి: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహణలో 32 మంది ఎమ్మెల్యేలు వెనకబడ్డారని సీఎం జగన్ వెల్లడించారు.పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఒకవేళ తీరు మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో సీట్లు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.రాష్ట్రంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మే 11వ తేదీన ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించింది. అప్పటి నుంచి ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, నియోజకవర్గ సమన్వయకర్త గ్రామాల్లో తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని.. వారి సమస్యలను పరిష్కరించాలని సీఎం జగన్ ఆదేశించారు. ఇప్పటివరకు ఈ కార్యక్రమం అమలు తీరు ఎలా ఉందనేదానిపై ప్రతి 3 నెలలకోసారి సీఎం జగన్ సమీక్ష నిర్వహిస్తున్నారు.

## కోర్టు ధిక్కార కేసులో టీటీడీ ఈఓ ధర్మారెడ్డికి ఊరట

అమరావతి: కోర్టు ధిక్కార కేసులో టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి ఊరట లభించింది. జైలు శిక్ష విధిస్తూ సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై స్టే విధించింది హైకోర్టు ధర్మాసనం.సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ ఈఓ ధర్మారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ మేరకు స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది.టీటీడీ ధర్మ ప్రచార పరిషత్‌లో ప్రోగ్రాం అసిస్టెంట్ల పోస్టుల భర్తీకి 2011లో జారీ చేసిన టీటీడీ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని, తమను ప్రోగ్రాం అసిస్టెంట్లుగా తమ స్వర్వీసులను క్రమబద్ధీకరించేలా ఆదేశించాలని కొమ్ము బాబు, రామావత్ స్వామి నాయక్, భూక్యా సేవ్లానాయక్‌లు పిటిషన్ దాఖలు చేశారు. క్రమబద్ధీకరించాలంటూ హైకోర్టు తీర్పు వెలువరించింది.అయితే, హైకోర్టు తీర్పును అమలు చేయటం లేదని పిటిషనర్లు మళ్లీ కోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది జూన్ 16న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన సింగిల్ బెంచ్.. టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డికి నెలరోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో వారం పాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. తాజాగా హైకోర్టు ధర్మాసనం స్టే విధించటంతో ఊరట లభించింది.

# ముగిసిన ఛైర్మన్ల పదవీ కాలం

విజయవాడ, డిసెంబర్ 16, రెండేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా బీసీ సంక్రాంతి పేరుతో భారీ కార్యక్రమం నిర్వహించింది. అదే రోజు 56 కార్పరేషన్లుకు ఛైర్మన్లు, ఒక్కో కార్పొరేషన్ కు 12 మంది చొప్పున డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. వెనుకబడిన తరగతులకు ఆర్థిక చేయూత అందించడంలో వెన్నుముకగా నిలబడాలనేది ఈ కార్పొరేషన్ల లక్ష్యం. ఇవాల్టితో వారి పదవీ కాలం ముగిసింది. బడుగు బలహీన వర్గాలు స్వశక్తితో నిలబడేలా ఆర్థికంగా చేయూతనివ్వడం, ఉపాధి కల్పించడం బీసీ కార్పొరేషన్ల లక్ష్యం. కుల వృత్తులు చేసుకుంటూ తరతరాలుగా పేదరికంలో మగ్గుతున్న వెనుక బడిన తరగతుల వారిని పేదరికం నుంచి శాశ్వత విముక్తి కల్పించేందుకు ఈ కార్పొరేషన్లు నియమించారు. ఇప్పుడు ప్రభుత్వం ఏం చేయనుందని ఆసక్తి నెలకొంది. వారినే కొనసాగిస్తారా.. లేకుంటే కొత్త వారిని నియమిస్తారా అని చర్చ నడుస్తోంది. ఇవాళ ముఖ్యమంత్రి పార్టీ లీడర్లతో సమావేశం కానున్నారు. ఇది గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో చేపట్టే సమీక్ష అయినా ఈ బీసీ కార్పొరేషన్లపై ఏమైనా చర్చ జరగొచ్చా అనే టాక్ వినిపిస్తోంది. ఈ కార్పొరేషన్లతో బీసీలు తల ఎత్తుకునేలా చేశామని ప్రభుత్వం చెబుతుంటే.. ప్రతిపక్షాలు మాత్రం అసలు ఏమీ చేయలేదని దుమ్మెత్తి పోస్తున్నాయి. పథకాలతో మాయ చేస్తున్నారనే తప్ప శాశ్వతంగా బీసీలు పేదరికం నుంచి బయట పడేందుకు ఎలాంటి కార్యక్రమాలు లేవంటున్నారు. ఎలాంటి అధికారాలు లేని బీసీ కార్పొరేషన్లు దేని కోసమని ప్రశ్నిస్తున్నారు. ఘనమైన చరిత్ర ఉన్న బీసీ కార్పొరేషన్, బీసీ కులాల కార్పొరేషన్లు వైసీపీ ప్రభుత్వం నామ మాత్రంగా మార్చేసిందని ఆరోపిస్తున్నాయి. బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని ఘనంగా ప్రకటిండమే తప్పు.. గత ప్రభుత్వాలతో పోలిస్తే స్వయం ఉపాధి కింద చాలా తక్కువ రుణాలు ఇచ్చిందంటున్నారు. తమ హయాంలో నాలుగేళ్లలో స్వయం ఉపాధికి రూ.1,626 కోట్ల రుణాలు ఇచ్చామని టీడీపీ ప్రకటించింది. వైసీపీ ప్రభుత్వం తాము ప్రాధాన్యంగా భావించిన రేషన్ పంపిణీ వాహనాలకు రూ.132 కోట్లు రాయితీగా ఇచ్చి మమ అనిపించిందన్నారు. పైగా గత ప్రభుత్వం బీసీలకు రాయితీ రుణాల కింద ఇచ్చి.. బ్యాంకుల్లో మిగిలిపోయిన రూ.200 కోట్లనూ వెనక్కు తీసుకుంటుందని ఆరోపించారు. టీడీపీ హయాంలో అన్ని కార్పొరేషన్ల ద్వారా అందించి, ఖర్చు కాకుండా మిగిలిపోయిన రూ.488 కోట్లు బ్యాంకుల్లో ఉ ందన్నారు. బీసీలకు స్వయం ఉపాధి కల్పన ద్వారా శాశ్వతంగా పేదరికాన్ని దూరం చేసేందుకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నాయి ప్రతిపక్షాలు. అన్ని పథకాల్లోని బీసీలకు ఇచ్చే వాటాను పక్కకు తీసి పెద్ద మొత్తంలో సాయాన్ని అందిస్తున్నట్లు అంకెల గారడీ చేస్తున్నారని ఆరోపిస్తున్నాయి. నవరత్న పథకాల నిధుల్నే కార్పొరేషన్ల ద్వారా చూపిస్తూ తిమ్మిని బమ్మిని చేస్తున్నారన్నారు. ఈ ఆరోపణలను తిప్పికొడుతున్న ప్రభుత్వం గతవారంలో విజయవాడ వేదికగా జయహో బీసీ పేరుతో భారీ బహిరంగ సభ పెట్టింది. ఇందులో మాట్లాడిన సీఎం జగన్...

బీసీల తన గుండెల్లో ఉన్నారంటూ పవర్‌ఫుల్ స్పీచ్ ఇచ్చారు. అదే స్టేజ్‌పై చంద్రబాబుపై విమర్శలు చేశారు. బీసీలంటే ఇస్త్రీపెట్టెలు, కుట్టుమిషన్లు కావని చంద్రబాబుకు చెప్పండని విమర్శించారు జగన్. 2014లో బీసీలకు ఏకంగా 114 వాగ్దానాలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా ఉన్న విషయాన్ని బాబుకు చెప్పండన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటున్న జగన్‌కు వెన్నెముక కులాలుగా మారామని చెప్పండన్నారు. రాజ్యాధికారంలో భాగస్వాములు అని గర్వంగా చెప్పాలన్నారు. వ్యవసాయ రుణమాఫీని ఒక మోసంగా చేసిన విషయాన్ని గుర్తు చేయండన్నారు. ఫీజు రిఎంబర్స్‌మెంట్ ఇవ్వకుండా ఉన్న దుస్థితిని చంద్రబాబుకు గుర్తు చేయాలన్నారు. కేసీ నుంచి పీజీ వరకు ఉచితంగా చదివిస్తానని చెప్పి మాట తప్పిన సంగతి గుర్తు చేయాలన్నారు. సబ్‌ప్లాన్ ద్వారా పదివేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పి బీసీలకు చేసిన ద్రోహాన్ని చంద్రబాబుకు గుర్తు చేయాలన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయామని అడిగితే అంతు చూస్తానంటూ మత్స్యకారులకు, తోకలు కత్తిరిస్తామని నాయీబ్రాహ్మణులకు చెప్పిన మాటలు గుర్తు చేయమన్నారు. అయ్యా బాబు.. మాకు తోకలు లేవు కానీ.. మీ తోకలను మీకు మొలిచిన కొమ్ములను, కొమ్ముకాసే వారిని కత్తిరించే చైతన్యం ఉందని గట్టిగా చెప్పాలన్నారు.

## కీవ్‌పై భీకర దాడికి.. రష్యా 2 లక్షల మంది సైనికులను సిద్ధం చేస్తోంది : ఉక్రెయిన్

ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. క్రెమ్లిన్ దాడిలో ఉక్రెయిన్ పూర్తిగా ధ్వంసమవుతోంది. రష్యాను నిలువరించేందుకు అక్కడి సైనికులు ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధంపై ఉక్రెయిన్ కమాండ్ ఇన్ చీఫ్ జనరల్ వలేరీ జాలుజ్నీ కీలక వ్యాఖ్యలు చేశారు. 2023 తొలి నెలల్లో రష్యా భీకర దాడులకు పాల్పడే అవకాశం ఉందని అన్నారు. ఇటీవల బ్రిటీష్ వీక్లీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.'వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో రష్యా భీకర దాడులకు పాల్పడొచ్చు. జనవరి చివర్లో దాడులు మొదలైనా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం రష్యా దాడులను తగ్గించడం కూడా యుద్ధ వ్యూహంలో భాగమే. ఈ గ్యాప్‌లో తమ సైనిక బలగాలను పెంచుకోవడం ద్వారా మళ్లీ యుద్ధానికి పూర్తి స్థాయిలో సిద్ధమవుతుంది. యుద్ధానికి సంబంధించి ఇది చాలా వ్యూహాత్మక నిర్ణయం. ప్రస్తుతం రష్యా రెండు లక్షల మంది సైనికులను సిద్ధం చేసుకుంటోంది. రాజధాని కీవ్‌పై రష్యా దళాలు మరోసారి విరుచుకుపడతాయనడంలో నాకు ఎలాంటి సందేహం లేదు' అని చెప్పుకొచ్చారు.అయితే ప్రస్తుతం తమ ముందున్న ప్రధాన లక్ష్యం ఫ్రంట్‌లైన్ ను కాపాడుకోవడమే అని వలేరీ జాలుజ్నీ అన్నారు. రాబోయే రోజులను దృష్టిలో పెట్టుకుని అందుకు పూర్తి సన్నద్ధమవుతున్నట్లు చెప్పారు. రష్యా మరోసారి విరుచుకుపడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎన్ని ట్యాంకులు, ఆయుధాలు, సైనికులు కావాలనే విషయంలో తాము కూడా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. 'మా భూభాగాన్ని కొంత కూడా వదులుకోవడానికి సిద్ధంగా లేము. యుద్ధంలో మా శత్రువును జయిస్తామనే నమ్మకం మాకు ఉంది. అయితే మాకు యుద్ధ వనరులు చాలా అవసరం. 300 యుద్ధ ట్యాంకులు, 600 నుంచి 700 వరకు ఇన్ఫాంట్రీ ఫైటింగ్ వెహికిల్స్ 500 హోవిట్జర్ లు అవసరం' అని అన్నారు.



# సంపాదకీయం

శనివారం 17-12-2022

## రిజర్వేషన్లతోనే పరిష్కారాలు

రాజకీయంగా వారి రాజకీయ లబ్ధి కోసం నిర్ణయాలు తీసుకుంటే కోర్టులలో అవి నిలబడవు అని, కోర్టులు కొట్టివేస్తాయని ప్రజల నమ్మకం. కానీ అందుకు విరుద్ధంగా 8 నవంబర్ 2022న దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఐదుగురు జడ్జీలు గల ధర్మాసనంలో 3:2 నిష్పత్తిలో ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్స్ రాజ్యాంగ అనుకూలమేనని సమర్థించటం దేశంలో పెద్ద చర్చకు దారితీసింది. ఇదే అత్యున్నత న్యాయస్థానం రిజర్వేషన్ల వాటా 50 శాతం దాటకూడదని ఇంద్రసహాణీ కేసులో 1992లో తీర్పునిస్తూ రిజర్వేషన్స్‌కు ఆర్థిక అంశాలను ప్రామాణికంగా తీసుకోలేమని మండల్ కమిషన్ రిపోర్ట్ ప్రకారం 52 శాతం జనాభా ఉన్న ఒబిసిలకు రిజర్వేషన్లను కేవలం 27 శాతానికి కత్తిరించారు. దేశం మొత్తం సంపదలో 45 శాతం ఒసిల ఆధీనంలో 40% ఒబిసిల ఆధీనంలో కేవలం 10% ఎస్‌సిల ఆధీనంలో 5% ఎస్‌టిల ఆధీనంలో ఉన్నది. ఒసి కులాలు సంపదలో మెజార్టీ భాగాన్ని పొందటమే కాకుండా అగ్ర క్విoటైల్ కూడా అసమానంగా కేంద్రీకృతమై ఉన్నాయి. అగ్ర క్వింటైల్ 55% సంపద ఒసిల ఆధీనంలోనూ 36% సంపద ఒబిసిల ఆధీనంలోనూ 5% ఎస్‌సిల ఆధీనంలోనూ 3% ఆదివాసీల ఆధీనంలోనూ దేశంలో వారివారి కులాల నిష్పత్తికి విరుద్ధంగా సంపదలు కేంద్రీకృతమై ఉన్నాయి. దీనికి వ్యక్తిగత ఆదాయాలు లేక పొదుపులు బట్టి కాకుండా చారిత్రక వారసత్వ సంపద అసమానతలు కొనసాగుతున్నాయి ఇది దేశ సామాజిక వ్యవస్థలో మెజారిటీ కులాలను అంటే బహుజనులను సమస్తాగతంగా బహిష్కరించడవే కారణం.రాజ్యాంగాన్ని 1950 జనవరి 26న దేశ ప్రజలు ఆమోదించుకున్న క్రమంలో ప్రపంచంలో మొట్టమొదటి సారిగా వెనుకబాటుతనం అనే పదాన్ని సృష్టించిన రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ భారతదేశంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాలను గుర్తించి వారి వెనుకబాటుతనాన్ని ప్రామాణికంగా తీసుకుని ఆర్టికల్ 15, 16 ప్రకారం అణచివేయబడ్డ అంటరాని కులాలకు వారివారి జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం (రిజర్వేషన్) ఎస్‌సి, ఎస్‌టిలకు ఇవ్వటం జరిగింది. తదుపరి 1979 లో వేసిన బిపి మండల్ కమిషన్ రిపోర్ట్ ప్రకారం వెనుకబడిన కులాల వారికి 1990 నుండి రెప్రజెంటేషన్ ఇవ్వటం జరుగుతుంది. ప్రస్తుతం ఒసి అంటే ఇతర కులాలుగా చెప్పుకుంటున్న వారిలో పేదలు ఉన్నారని ఎటువంటి సర్వే కానీ, కమిషన్ కానీ, పరిశోధన కానీ చెయ్యకుండానే దేశ చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా కేవలం ఒక్క రోజులోనే పార్లమెంటు ఉభయ సభల్లో రాజ్యాంగ చట్టం 2019ను ఆమోదించి తర్వాతి రోజు రాష్ట్రపతిచే ఆర్థిక బలహీన వర్గాలకు (ఇడబ్లుఎస్) రిజర్వేషన్ గెజిట్ విడుదల చేసి వెనువెంటనే అమ లు చేయాలని కేంద్ర, రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేశారు. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును తుంగలో తొక్కి పేదరికాన్ని ప్రామాణికంగా తీసుకుని ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి కులా లు కాకుండా మిగిలిన ఇతర కులాలలో ఉన్న పేదలకు మాత్రమే వర్తించే విధంగా చేసిన రాజ్యాంగ (103వ సవరణ)చట్టం 2019 ఇడబ్ల్యుఎస్ 10% కోటాను సమర్థించింది. దేశంలో గత రెండు దశాబ్దాలుగా నిరుద్యోగ వృద్ధి, ఆర్థిక అభద్రతాభావం పెరుగుతూ కుల ప్రాతిపదికన సంపద అసమానతలు తీవ్రమవుతున్నందున దీనిపై పునః సమీక్షించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత సమకాలీన సమాజంలోఉన్న అసమానతలు ఒక్కరి జీవిత కాలంలో ఉత్పన్నమైనవి కావు అదే విధంగా వివిధ అంతరాలుగా విడిపోయి ఉన్న కులాలు వారి సామర్థ్యం ఆశయం కృషి వల్ల కాదు అది కేవలం వారసత్వాలు. విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనుకబాటుతనాల అసమానతలు తరతరాలుగా కులం ఆధారంగా, వారసత్వంగా బదిలీ చేయబడుతున్నాయి.ఆర్థిక స్థితిగతులను కొలవటానికి సంపద మెరుగైన కొలమానం. సంపదను కులం వారసత్వ సంపదగా ఎలా బదిలీ చేస్తుందో 2021 లో విడుదల చేసిన ఆలిండియా అప్పు , పెట్టుబడి సర్వే 2019ను పరిశీలిస్తే అర్థమవుతుంది. భూమి, పశువులు, భవనాలు వ్యవసాయ యంత్రాలు, రవాణాతో పాటు ఆర్థిక విషయాలైన షేర్స్ డిపాజిట్స్, గృహస్థులు స్వీకరించదగిన మొత్తం ఆదాయం పరిగణనలోకి తీసుకుని చేసిన సర్వేలో భారతదేశంలో అసమానతలు 1990 నుండి 2020 మధ్య బాగా పెరిగినాయి మరి ముఖ్యంగా 2000 సంవత్సరం తర్వాత మొదటిగా సంపద వ్యత్యాసాలు రెండవదిగా ఆదాయం, వినియోగ అసమానతలు విపరీతంగా పెరుగుతూ పోతున్నాయి.భారత దేశంలో సగటు తలసరి ఆదాయం 2019లో ఇతర కులాలలో అంటే ఒసిలలో రూ. 8,03,977గా, ఒబిసిలలో రూ. 4,09,792 గా, ఎస్‌సిలలో రూ. 2,28,388గా, ఎస్‌టిలలో రూ. 2,32,349 గాను ఉంది. సరాసరిన ఒసి కులాల సంపద ఎస్‌టిలకంటే నాలుగు రెట్లు ఎక్కువగాను ఎస్‌సిల కంటే మూడు రెట్లు ఎక్కువగాను ఒబిసిల కంటే రెండు రెట్లు ఎక్కువగా ఉన్నది . ఇంత పెద్ద సామాజిక ఆర్థిక విపత్తు సంభవించడానికి కారణం దేశంలో మెజారిటీ బహుజనులైన ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు ఉన్నత న్యాయస్థానాలైన రాష్ట్ర హైకోర్టులలో, సుప్రీంకోర్టులో, ప్రధాన రాజకీయ పదవులైన రాష్ట్ర ముఖ్యమంత్రి, దేశ ప్రధాన మంత్రులకు రిప్రజెంటేషన్ లేదు.అదే విధంగా దేశం కోసం సరిహద్దుల్లో ప్రాణాలు ఇస్తున్న సైనికులు అందరూ బహుజనులే అయినప్పటికీ రక్షణ రంగంలోనీ కీలక పదవులకు ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రిప్రజెంటేషన్ లేదు అని తెలుసుకుంటే బహుజనుల చైతన్యం మరో సామాజిక ఉద్యమానికి నాంది పలుకుతుంది. జనాభా దామాషా ప్రకారం అంటే ఒసిలకు 15%, ఒబిసిలకు 52%, ఎస్‌సిలకు 15%, ఎస్‌టిలకు 8%, మతం మార్చుకున్న మైనారిటీలకు 10% రిప్రజెంటేషన్ ప్రజాస్వామ్యబద్ధంగా ఇవ్వటం ద్వారా అందరికీ సమాన అవకాశాలు దక్కి అందరూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు అవుతూ సమ సమాజ నిర్మాణం దిశగా పయనిస్తూ ప్రపంచంలోనీ అగ్ర దేశాల సరసన భారతదేశాన్ని నిలబడతారు.

## రెండు రాష్ట్రాల మధ్య సెంటిమెంట్ మంటలు

విజయవాడ, డిసెంబర్ 16, ఎనిమిదేళ్ల కిందటి జ్వాల మరోసారి భగ్గుమంది. రెండు రాష్ట్రాల మధ్య సెంటిమెంట్ మంటలు మళ్లీ రాజుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఎంలూ ఒక్కటయ్యారంటూ బీజేపీ చేస్తున్న విమర్శలు.. సరికొత్త రాజకీయ అనుమానాలకు తావిస్తున్నాయి. ఇంతకూ ఇద్దరు సీఎంలూ ఒక్కటయ్యారా? అలా ఒక్కటవ్వడం వల్ల వచ్చే ప్రమాదాలేంటి? ప్రయోజనాలేంటి? ఇది టూస్టేట్స్‌లో వేడిపుట్టిస్తున్న టాపిక్. రెండు తెలుగు రాష్ట్రాల్లో సెంటిమెంటు మంట సెగలు పుట్టిస్తోంది. విభజన జరిగి ఎనిమిదేళ్లయ్యాక ఇప్పుడు సమైక్య జ్వాల రాజుకుంది. తెలుగు రాష్ట్రాల సీఎంలు ఒక్కటయ్యారు. తెలంగాణా సమాజం గమనించాలి సుమా అంటున్నారు టీ-బీజేపీ చీఫ్ బండి సంజయ్. ఏపీ సీఎం, తెలంగాణ సీఎం ఇద్దరూ ఒక్కటే. దోచుకుందాం.. దాచుకుందాం అనేదే వీళ్ల పాలసీ. ఓడిపోతాం అనుకున్నప్పుడే జైఆంధ్రా, జై తెలంగాణ నినాదం అందుకుంటారట. ప్రజా సంగ్రామ యాత్ర ఐదో విడత ముగింపు సందర్భంగా పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో నోటిని బాగానే జాడించారు బండి.రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ ఆత్మరక్షణ కోసమే సెంటిమెంట్‌ను వాడుకుంటున్నారా? జైఆంధ్రా, జై తెలంగాణా నినాదాల్ని సొంత రాజకీయాలకు వస్తువులుగా వాడుకుంటున్నారా..? నిజానికి ఇవి తీవ్రమైన ఆరోపణలే. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎదగాలన్న కసితో పనిచేస్తున్న బీజేపీయులకు ఇదొక అందివచ్చిన అవకాశం కూడా. కానీ? విపక్షాల్లో ఇటువంటి అనుమానాలకు దారితీసిన పరిస్థితులు కూడా సాదాసీదా కాదు. రెండు రాష్ట్రాలూ మళ్లీ కలిసి ఒక్కటైతే సంతోషించేవాళ్లలో మేమే ఫస్ట్? మా ముఖ్యమంత్రి మనోభావం కూడా ఇదే అనేసిన సజ్జల? ఇటూఇటూ రెండువైపులా నిప్పు పెట్టారు. అవి యాదృచ్ఛికంగా అన్న మాటలు కాదనే వాదనలూ వినిపించాయి.హక్కుల సాధనలో ఏపీ ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకిస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి చేసిన కామెంట్లకు కౌంటర్లివ్వబోతూ నోరు జారార్లే అని మొదట్లో అందరూ అనుకున్నారు. కానీ వాటి మీద క్లారిఫికేషన్లు రాకపోయేసరికి రియాక్షన్లు స్పీడందుకున్నాయి. ఇద్దరు ముఖ్యమంత్రులూ తమతమ ప్రజల తరఫున నిలబడి సీరియస్‌గా పోరాడుతున్నారా అనే విషయాలను ప్రజలు లోతుగా గమనిస్తున్నారు. ఇదే గ్యాప్‌లో ఉమ్మడి ఆస్తుల విభజనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది అంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని కార్నర్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది ఏపీ సర్కారు. ఆ విధంగా విభజన జ్ఞాపకాల్ని మళ్లీ తవ్వుకున్నట్టయింది. ఇంకేముంది మంటలు రిపీటైనట్టే! ఈ కొత్త పిటిషన్ ద్వారా కేసీఆర్‌తో యుద్ధం చేస్తున్నామని వైసీపీ ప్రభుత్వం చెప్పబోతోందా? లేక మరోసారి సెంటిమెంట్ అస్త్రాన్ని కేసీఆర్ చేతుల్లో పెట్టబోతున్నారా? అనేవి అపోజిషన్ వాళ్ల డౌట్లు. రెండు పార్టీల మధ్య రాజకీయ ఒప్పందం కూడా కుదిరిందా అనేవి వైసీపీని ప్రశ్నలు వేధిస్తు?న్నాయి. తెలంగాణా సీఎంకు ఏపీ సీఎం ఒక్క లేఖ రాస్తేనో, ఒకసారి కూర్చుని మాట్లాడుకుంటేనో పోయే దానికి సుప్రీంకోర్టు దాకా వెళ్లాల్సిన అగత్యం ఎందుకొచ్చింది.. అనేది ప్రధాన విమర్శ. ఆల్రెడీ ఉమ్మడి ఆస్తుల పంపకాలు ఎనిమిదేళ్లుగా కంటిన్యూ అవుతూనే ఉంది. చెరోవైపు నిలబడి తెగేదాకా లాగుడే తప్ప? పరిష్కార మార్గం వెతికే మార్గం చూడటం లేదు. హైదరాబాద్‌పై ఏపీకి పదేళ్ల పాటుండే హక్కునెలాగూ చేతులారా పోగొట్టుకుంది ఏపీ. 14 ఉమ్మడి ఆస్తుల మీద కేంద్ర హోంశాఖ కలుగజేసుకుని రెండు రాష్ట్రాల చీఫ్ సెక్రటరీల్ని పిలిపించుకుని మాట్లాడినా నో యూజ్. జనాభా ప్రాతిపదికన పంచుకోవాలన్న సానుకూల పరిష్కారం కూడా వర్కవుట్ కాలేదు. ఈ పంచాయతీ కోసమే షీలా భిడే కమిటీ వేసినా? ఆ కమిటీ సిఫార్సుల్ని ఏ ఒక్క రాష్ట్రమూ గౌరవించడం లేదు. విభజన చట్టంలోని షెడ్యూల్ 9 ప్రకారం ప్రభుత్వ సంస్థల్ని పంచుకోవడంపై రెండు రాష్ట్రాలూ ఎటూ తేల్చడం లేదు. లీగల్ ఒపీనియన్ తీసుకోవడం తప్ప మరో దిక్కు లేదని డిసైడైంది కేంద్ర హోంశాఖ.సరిగ్గా ఇదే గ్యాప్‌లో సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది ఏపీ సర్కార్. కానీ ఇది సీరియస్ ఫైటే కాదని, రెండు రాష్ట్రాల జనాల్ని ప్రభావితం చేయడానికేనని బీజేపీ అంటోంది. ఫ్లాష్ బ్యాకుల్ని తవ్వుకోవడం ద్వారా మళ్లీ రాజుకున్న విభజన సెంటిమెంట్ ఎందాకా వెళుతుందో చూడాలి.

## కాపు నేతలు కొత్త పార్టీ సాధ్యమేనా

గుంటూరు, డిసెంబర్ 16,ఆంధ్రప్రదేశ్‌లో కాపు రాజకీయ నేతలు ఇటీవలి కాలంలో పార్టీలకు అతీతంగా సమావేశాలు నిర్వహిస్తూ యాక్టివ్ అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. అధికార వైఎస్‌ఆర్‌సీపీ కాపు నేతలు మాత్రం ఇలా విడి సమావేశాలకు హాజరు కావడం లేదు. ఆ పార్టీ కాపు నేతలు భేటీలు అవుతున్నారు. తాజాగా వంగవీటి రంగా వర్ధంతి సందర్భంగా విశాఖలో భారీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు చెప్పినట్లుగా ఇప్పుడు ఏం జరిగినా రాజకీయం ఉంటుంది.. రాజకీయం లేదంటే.. అబద్ధం చెప్పినట్లే. అందుకే కాపు నాయకులు ఇప్పుడు రాజకీయంగా ఏ నిర్ణయం తీసుకోబోతున్నారు ? ఎలాంటి అడుగులు వేయబోతున్నారన్నది కీలకంగా మారింది. అన్ని పార్టీల్లోనూ కాపు సామాజికవర్గ నేతలు కీలకంగా ఉన్నారు. ముఖ్యమంత్రి స్థాయికి వెళ్లలేదు కానీ ముఖ్యమంత్రి నిర్ణయాలను ప్రభావితం చేయగలిగే స్థాయికి.. బలాన్ని కాపు నేతలు పొందారు. గత ప్రభుత్వంలో..ఈ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంలుగా ఉన్నారు. అయితే వారికి ఎంత పవర్ ఉందనే విషయం పక్కన పెడితే.. వారిని రాజకీయంగా ప్రాధాన్యపరంగా పార్టీలు గుర్తిస్తున్నాయి. అయితే వారికి సీఎం పదవి అనేది ఇంకా అందడం లేదు. ఆ అసంతృప్తి ఉ ంది. ఇటీవలి కాలంలో కాపు నేతలు వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆ మధ్య నిర్వహించిన రెండు సమావేశాలతో కాపు నేతలంతా కలిసి కొత్త పార్టీ పెడతారన్న ప్రచారం జరిగింది.కానీ ఇప్పటి వరకూ అది సాకారం కాలేదు. తాజాగా మరోసారి భేటీలు అవుతున్నారు. వంగవీటి రంగా వర్ధంతి సందర్భంగా వీరంతా మరోసారి భేటీ కానున్నారు. అన్ని పార్టీల్లోని కాపు నేతలు.. సమావేశమవుతున్నారు. వారికి పార్టీల అడ్డంకులు రావడం లేదు. తమ పార్టీకి ఇబ్బంది లేకుండా.. కుల సంఘ సమావేశాలు.. నేతల భేటీల్లో పాల్గొంటున్నారు. అది సామాజికవర్గ సమావేశమే కానీ.. రాజకీయం కాదని సర్ది చెప్పుకుంటున్నారు. ఈ సమావేశాల పట్ల వారు ఉన్న పార్టీలు కూడా పెద్దగా ఆందోళన చెందడం లేదు. పార్టీకి వారు నిబద్ధులై ఉంటారని నమ్మకంతో ఉన్నారు. అయితే వైఎస్‌ఆర్‌సీపీ కాపు నేతలు మాత్రం..ఈ సమావేశాల్లో పాల్గొనడం లేదు. ఆ పార్టీ కాపు నేతలంతా భేటీ అవుతూంటారు. అయితే ఈ సమావేశాలు ప్రధానంగా పవన్ కల్యాణ్‌కు కౌంటర్ ఇవ్వడానికే పెడుతున్నారు. అందుకే.. వైఎస్‌ఆర్‌సీపీ కాపు నేతలపై ఆ సామాజికవర్గంలోనే విమర్శలు వస్తూ ఉంటాయి. కాపు నేతలంతా కొత్త పార్టీ పెడితే ఎలా ఉంటుందా అనే ఆలోచన కూడా గతంలో చేశారన్న ప్రచారం జరిగింది. కానీ కాపులు మాత్రమే ఓట్లు వేస్తే ఎవరూ గెలవరు. అందుకే విరమించుకుని ఉంటారు.కానీ ఆ సామాజికవర్గం నుంచి పవన్ కల్యాణ్ .. మాస్ లీడర్‌గా రాజకీయ బరిలో ఉన్నారు. అందరూ కలిసి ఆయనను సమర్థిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన కూడా వారికి వచ్చి ఉండవచ్చు. కానీ అది అంత తేలికగా సాధ్యమయ్యే విషయం కాదు. పవన్ కల్యాణ్ కూడా ఒక్క కాపులు ఓటు వేస్తేనే తాను సీఎం కాలేనని తెలుసు. అందరి మద్దతూ ఆయన కోరుకుంటారు. అదే సమయంలో కాపు నేతలు తమ రాజకీయ భవిష్యత్ ను కాదనుకుని.. పవన్‌కు మద్దతు తెలుపడం కూడా కష్టమే. కాపు నేతలు సమావేశమైనా.. ఓ పార్టీకి ఏకపక్షంగా మద్దతు పలకడం కష్టం. ఎందుకంటే అన్ని పార్టీల్లోనూ కాపు నేతలు ఉన్నారు. వారికి ప్రాధాన్యం లభిస్తోంది. అందరూ బయటకు వచ్చి తమ సామాజికవర్గానికే మద్దతు ఇవ్వాలని అడగలేరు. కాపులు కూడా ఒకే కులం కాదు.. కాపు, తెలగ, ఒంటరి, బలిజ రకాలుగా ఉన్నాయి. అందులోనూ రాజకీయం చిచ్చు పెడుతుంది. అందుకే... కాపు నేతలు సమావేశాలు..తమ వర్గానికి మెరుగైన అవకాశాల పొందేలా చేయడం.. అవకాశం వచ్చినప్పుడు సీఎం పీఠాన్ని అందుకోవడానికి ప్రయత్నం చేయాలనే కోణంలోనే జరిగే అవకాశం ఉందనేది ఎక్కువ మంది చెప్పేమాట.

## ఎంపీ కాదు..ఎమ్మెల్యేల గురి

విశాఖపట్టణం, డిసెంబర్ 16, ఉమ్మడి విశాఖజిల్లాలో ఒకప్పుడు ఎంపీలు చాలా పవర్ ఫుల్. సుదీర్ఘ అనుభవం, విస్తృతమైన పరిచయాలతో ఓ వెలుగు వెలిగేవాళ్లు నాయకులు. సీనియారిటీ, సంప్రదాయంగా సీట్లు కేటాయించే విధానానికి తొలిసారి బ్రేకులు వేసింది వైసీపీ. 2019లో అనూహ్యంగా కొత్త ముఖాలను తెరపైకి తెచ్చి గెలిపించుకుంది. వైసీపీ నుంచి విశాఖ ఎంపీగా ప్రముఖ బిల్డర్ ఎంవీవీ సత్యనారాయణ, ఎస్.టి. రిజర్వ్డ్ నియోజకవర్గం అరకు నుంచి గొడ్డేటి మాధవి.. అనకాపల్లి నుంచి డాక్టర్ సత్యవతమ్మ గెలిచారు. ఈ ముగ్గురు రాజకీయంగా నిలదొక్కుకునేందుకు మూడున్నరేళ్లుగా చేయని ప్రయత్నాలు లేవు.మొదట్లో విశాఖ ఎంపీ ఎంవీవీకి అన్నీ అనుకూలంగా ఉన్నప్పటికీ.. తర్వాత అంతర్గత సమీకరణాలు వేగంగా మారాయి. ముఖ్య నాయకుడితోనే ఆయన వైరం పెట్టుకున్నారు. ప్రస్తుతం తన వ్యాపార సంబంధమైన ప్రాజెక్టులపై తలెత్తిన విమర్శలను పరిష్కరించుకుని పైచెయ్యి సాధించే పనిలో ఉన్నారు ఎంవీవీ. వచ్చే ఎన్నికల్లో ఆయన్ని అసెంబ్లీ బరిలోకి దించేందుకు వైసీపీ అధిష్ఠానం మొగ్గు చూపుతుందనే చర్చ బలంగా ఉంది. విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించిన వెలగపూడికి అడ్డుకట్ట వేయడానికి ఎంవీవీనే బలమైన అభ్యర్థిగా హైకమాండ్ నిర్ణయం తీసుకున్నట్టు భోగట్టా. మొదట్లో ఎంపీ అంతగా సుముఖత వ్యక్తం చేయనప్పటికీ.. పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రమోషన్ వస్తుందనే ఆలోచనలో ఉన్నారట.ఇక టీచర్‌గా కెరీర్ ప్రారంభించి అనూహ్యంగా ఎంపీ అయ్యారు గొడ్డేటి మాధవి. ఆమె తండ్రి దేవుడు చింతపల్లి మాజీ ఎమ్మెల్యే అయినప్పటికీ ఆ నీడ ఎప్పుడు ఆమె మీద పడలేదు. తొలి ప్రయత్నంలోనే కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్ పై భారీ మెజారిటీతో మాధవి గెలిచారు. అరకు పార్లమెంట్ పరిధిలోనే పాడేరు, అరకు అసెంబ్లీ స్థానాల్లో కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, చెట్టి ఫాల్గుణ గెలిచారు. మొదట్లో వీరంతా సఖ్యంగానే కనిపించినప్పటికీ తర్వాత రాజకీయం రంగు మారింది. ఆ ఎమ్మెల్యేలతో మాధవికి వర్గ విభేదాలు మొదలయ్యాయి. దీనివెనుక బలమైన కారణాల్లో ఒకటి.. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ సీటుపై మాధవి కన్నేయడమేనట. సొంత నియోజకవర్గమైన పాడేరు నుంచి పోటీకి ఆసక్తిని కనబరుస్తున్నారట మాధవి. ఆ దిశగా తన వర్గాన్ని యాక్టివేట్ చేసి పనిలో ఉన్నారట. దీంతో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అలర్ట్ అయ్యారు. ఇటీవల జిల్లా పార్టీ అధ్యక్షురాలిగా పగ్గాలు చేపట్టడంతో అసంతృప్తులు కాస్త చల్లబడ్డాయి. ఎమ్మెల్యే నుంచి ఎదురుదాడి పెరగడంతో మాధవి పునరాలోచనలో పడ్డారట. ఎమ్మెల్యే అవ్వాలనే కోరిక నెరవేర్చుకోవడానికి అరకుపై ఫోకస్ పెట్టారట. ఇక్కడ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణది వాల్మీకి సామాజికవర్గం. కానీ.. అరకులో కొండదొర సామాజికవర్గం బలం ఎక్కువ. పైగా గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా ఆదివాసీ హక్కుల పరిరక్షణకు మాధవి తండ్రి దేవుడు పనిచేశారు. వామపక్ష పార్టీలు, గిరిజన సంఘాల మద్దతు కూడగట్ట గలిగితే తన గెలుపు ఈజీ అవుతుందనే అంచనాల్లో మాధవి ఉన్నారట. ఎంపీ వ్యూహాలను పసిగట్టిన ఎమ్మెల్యే ఫాల్గుణ.. విరుగుడు మంత్రాలు వేస్తున్నారట.మరో నియోజకవర్గం అనకాపల్లి. గత ఎన్నికల్లో టీడీపీ టిక్కెట్ ఆశించి భంగపడ్డ భీశెట్టి సత్యవతి అనూహ్యంగా వైసీపీలోకి వచ్చారు. ఎమ్మెల్యేగా వెళ్లాలని ఆశపడ్డా.. పార్టీ నిర్ణయం మేరకు ఎంపీగా గెలిచారు. మంత్రి అమర్నాథ్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు వర్గాలకు దీటుగా రాజకీయం చేయాలని చూశారు. ఆ తర్వాత కాలంలో మంత్రి, ఎంపీ సయోధ్యకు వచ్చినట్టు కనిపించినా.. దాడి వెర్సస్ ఎంపీ కుంపటి రాజుకుంటూనే ఉంది. వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి కాకుండా యలమంచిలి నుంచి పోటీ చేయాలని అమర్నాథ్ చూస్తున్నారట. దాంతో అనకాపల్లి అసెంబ్లీ సీటుపై ఎంపీ సత్యవతి నజర్ పడినట్టు సమాచారం. గవర సామాజికవర్గానికి ప్రాతినిధ్యం ఇవ్వాలనే డిమాండ్‌కు అనుగుణంగా అనకాపల్లి సీటు కోసం గట్టిగా ప్రయత్నించాలని సత్యవతమ్మ భావిస్తున్నారట.

## మైలవరంపై నియోజకవర్గ సమీక్షలు

విజయవాడ, డిసెంబర్ 16,2024 ఎన్నికలే లక్ష్యంగా పార్టీని పరుగులు పెట్టిస్తున్న వైసీపీ అధినేత, సీఎం జగన్ ఒక్కో నియోజకవర్గంపై సమీక్షలను కంటిన్యూ చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తోపాటు నియోజకవర్గానికి చెందిన 50 మంది కీలక నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీ పరిస్థితిని, ప్రభుత్వ పథకాల అమలు తీరును సమీక్షించారు. మైలవరం నియోజకవర్గంలోనే లబ్ధిదారులకు నేరుగా 900 కోట్ల సాయం చేశామని లెక్కలు చెప్పారు సీఎం జగన్.89 శాతం ఇళ్లకు ఆప పథకాలు అందాయని, ఇంటింటికీ వెళ్లి చేసిన మంచిని చెప్పుకోవాలన్నారు. జనవరి నుంచి బూత్ కమిటీలు, 50 ఇళ్లకు ఇద్దరు చొప్పున గృహ సారథుల్ని నియమించాలని నేతల్ని ఆదేశించారు. ఈ సమావేశంలోనే ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు, మంత్రి జోగి రమేష్‌కు మధ్య ఉన్న గ్యాప్ చర్చకు వచ్చింది. గ్యాప్ ఉంటే రండి.. మాట్లాడదాం.. తలో కప్పు కాఫీ తాగి వెళ్దురు. ఎస్, ఈ మాటలన్నది సీఎం జగన్ మోహన్ రెడ్డి. ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై నాయకులతో సమావేశం నిర్వహించారాయన. మంత్రి జోగి రమేష్‌తో నెలకొన్న విభేదాలను జగన్ దృష్టికి తీసుకెళ్లారు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్. వారంలో ఇద్దరూ కలిసి రావాలని సీఎం జగన్ ఆదేశించారని తెలిపారు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్. సీఎం జగన్ ఫోకస్ పెట్టడంతో మంత్రి, ఎమ్మెల్యే మధ్య గ్యాప్‌కు ఇకపై ఫుల్‌స్టాప్ పడే అవకాశం ఉందని కేడర్ భావిస్తోంది.

## కాపు నేతల భేటీ.... లెక్కేంటీ

విజయవాడ, డిసెంబర్ 16,గంటా, కన్నా, బోండా. వీరి పార్టీలు వేరు. కానీ వీరిలో కామన్ పాయింట్ కాపు సామాజికవర్గం. వీరు ముగ్గురు అర్ధరాత్రి వరకు చర్చలు జరపడమే ఇప్పుడు ఏపీలో పొలిటికల్ అటెన్షన్‌ను క్రియేట్ చేస్తోంది. పైగా వీరి భేటీకి ముందు కన్నా లక్ష్మీనారాయణను జనసేన కీలక నేత నాదెండ్ల మనోహర్ కలవడం మరింత ఆసక్తిగా మారింది. బీజేపీ నేత కన్నా, టీడీపీలో ఉన్న గంటా, బోండా ఉమ విజయవాడలో కలిశారు. అర్ధరాత్రి వరకు చర్చలు జరిపారు. గతంలో ఎప్పుడూ కలవని వీరు చర్చలు జరపడం ఆసక్తిగా మారింది. ఈ నెల 26న రంగా వర్ధంతి రోజున విశాఖలో కాపు నాడు మహాసభ ఉంది. ఆ రోజు వివిధ పార్టీల్లోని కాపు నేతలంతా కీలక ప్రకటన చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో విజయవాడలో కన్నా, గంటా, బోండా భేటీ రాజకీయ ప్రాధాన్యతను పెంచేస్తోంది.వీరంతా కలిసి ఒకే జెండా కప్పుకుంటారా? లేదంటే కొత్త జెండాను ప్రకటిస్తారా? అనేది ఆసక్తిగా మారింది. అదీ కాక గంటా, కన్నాను కలవడానికి ముందు జనసేన నేత నాదెండ్ల మనోహర్? లక్ష్మీనారాయణను కలవడం, సుదీర్ఘంగా చర్చలు జరపడం ఆసక్తిగా మారింది. ఇటీవల కాపు సీఎం నినాదాన్ని వినిపిస్తున్నారు కొందరు నేతలు. ఈ నేపథ్యంలోనే జరుగుతున్న పరిణామాలు కీలకంగా మారాయి. కాపు నేతను సీఎం అభ్యర్థిగా ప్రకటించే వారికే తమ మద్దతు ఉంటుందనే ప్రకటన చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.కానీ తమ భేటీకి రాజకీయ ప్రాధాన్యత లేదని చెప్పారు గంటా శ్రీనివాసరావు. తమ భేటీలో రంగా వర్ధంతి కార్యక్రమం చర్చకే రాలేదన్నారు బోండా ఉ మ. రాజకీయ చర్చే జరగలేదన్నారు. బుధవారం రాత్రి కన్నా కూడా ఇదే చెప్పారు. కేవలం డిన్నర్ కోసమే మీటింగ్ అయ్యామని చెప్పుకొచ్చారు. ఏమో లోగుట్టు పెరుమాళ్ళకెరుక.

## ఏపీ పొలిటికల్ కొత్త మెరుపులు

విజయవాడ, డిసెంబర్ 16, విజయవాడలో అధికార వైసీపీ.. జయహో బీసీ సభ ఏర్పాటు చేశాక.. ఏపీ పొలిటికల్ తెరమీద కొత్త మెరుపులు కనిపిస్తున్నాయ్. దీంతో అలర్టయిన టీడీపీ నేతలు.. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో బీసీ సభను పెట్టారు. గురజాల నియోజవర్గం పరిధిలోని బీసీలు ఈ మీటింగ్‌కు హాజరయ్యారు. అయితే, దీనిపై గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పొలిటికల్‌గా కాక పుట్టించాయ్. మనం చేసిన వాటిని మనమే చెప్పుకోవడం కంటే? దాన్ని ప్రత్యర్థి పార్టీలు ఫాలో అయినప్పుడు ఉండే కిక్కే వేరప్పా? అంటూ ఆయన చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. బీసీల పార్టీగా చెప్పుకొనే టీడీపీ? అధికారంలో ఉన్నప్పుడు వాళ్లకోసం ఏమీ చేయలేదన్నది కాసు విమర్శ. టీడీపీ హయాంలో ఒకరిద్దరికి తప్ప బీసీలెవ్వరికీ పదవులివ్వలేదనీ? అదే వైసీపీ అధికారంలోకి రాగానే ఎనిమిది మంది బిసిలకు పదవులిచ్చామనీ? మహేశ్‌రెడ్డి చెప్పుకొచ్చారు. ఇప్పుడు తమను, టీడీపీ ఫాలో అవుతోందన్నది వైసీపీ ఎమ్మెల్యే సెటైరన్నమాట. అందుకే, వైసీపీ ఏర్పాటుచేసిన జయహో బీసీ సభను చూసి.. టీడీపీలో కదలిక వచ్చిందని ఎద్దేవా చేశారు ఎమ్మెల్యే.ఎమ్మెల్యే వ్యాఖ్యలను.. అదే రేంజ్‌లో తిప్పికొట్టారు మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు. టీడీపీ.. బీసీల సభ ఏర్పాటుచేస్తే ఎమ్మెల్యేకు అంత ఉలుకెందుకని ప్రశ్నించారు. నిజంగా బీసీలకు మంచే చేసుంటే? ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీసీనాయకులు ఎందుకు రోడ్డెక్కుతున్నారో చెప్పాలన్నారు. వైసిపి హయాంలో చాలా మంది బీసీనేతలు, కార్యకర్తలు.. హత్యకు గురయ్యారన్నారని విమర్శించారు.టిడిపి, వైసిపిల మధ్య విమర్శలు మామూలే అనుకుంటే.. నడుమ నేనంటూ జనసేన తలదూర్చింది. గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాసు, మాజీ ఎమ్మెల్యే యరపతినేని ఇద్దరూ బిసిలకు అన్యాయం చేశారంటూ? లోకల్ జనసేన నాయకుడు మందపాటి దుర్గారావు విమర్శలు గుప్పించడం.. వ్యవహారాన్ని మరో మలుపు తిప్పింది. కాసు మహేష్ రెడ్డి బిసిల నుంచి గురజాల సీటు లాక్కుంటే? యరపతినేని ఒకరిద్దరికి తప్ప బిసిలకు పెద్దగా పదవులివ్వలేదనీ ఆరోపించారు దుర్గారావు.నిజంగా వైసీపీ, టీడీపీలకు చిత్తశుద్ధి ఉంటే.. బీసీలకు టిక్కెట్ ఇచ్చి గెలిపించాలని సవాల్ విసిరారు. అంటే, బీసీనైన తాను నిలబడితే .. గెలుపుకోసం పోటీ చేయాలని.. ఇండైరెక్టుగా కాదు, డైరెక్టుగానే అడుగుతున్నాడు ఈ జనసేన నాయకుడు. మరి, ఈ రచ్చ ఇలాగే కంటిన్యూ అవుతుందా? ఫుల్‌స్టాప్ పడుతుందా? అన్నదే గురజాల పాలిటిక్స్‌లో మెయిన్ గుసగుసలా మారింది.

## లంక గ్రామాల అవస్థలకు ఫుల్ స్టాప్ ఎప్పుడు

రాజమండ్రి, డిసెంబర్ 16, దశాబ్దాలు తరబడి వంతెనల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.. అన్నీ పనులు ఆమోదం లభించింది అనుకునే లోపు ఏదో అవాంతరాలు వస్తూనే ఉన్నాయి, లంక గ్రామాలలో ఏడో తరగతి వరకే స్కూలు ఉంటుంది.ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మండలం పల్లంకురు నుండి బలుసు తిప్ప గ్రామం వరకు ఉన్న 10 గ్రామాలను, ఐ పోలవరం మండలం గుత్తెనదీవి మూల పొలం కలుపుతూ గోదావరి నది పాయపై వంతెన నిర్మించాలని అనుకున్నారు.. 2009 లో అప్పటి సీఎం వైఎస్ రామాలయంపేట జి మూలపాలెం 350 మీటర్ల వంతెన నిర్మాణానికి 22 కోట్లతో శంకుస్థాపన చేశారు.. ఆ బ్రిడ్జి నిర్మాణానికి పిల్లర్లు వేసేందుకు కాంట్రాక్ట్ తీసుకున్న కాంట్రాక్టర్ కి బిల్లులు చెల్లించలేదు దానిపై కోర్టుకు వెళ్లడంతో ఆ పనులు అక్కడే ఆగిపోయాయి.. కోర్టు కేసుల తర్వాత ఈ ప్రభుత్వంలో మోక్షం లభించింది.. 2021లో బ్రిడ్జి నిర్మాణం అంచనాని 76 కోట్లకు పెంచుతు ప్రభుత్వం టెండర్లుని ఆహ్వానించింది? కానీ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.ఈ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే కాట్రేనికోన మండలం పల్లంకురు పరిసర ప్రాంతాల్లో 30 వేల మందికి ఉపయోగము ఉంటుంది.. ముఖ్యంగా బలుసు తిప్ప పరిసర ప్రాంత మత్స్యకారులు తమ మత్స్య సంపదను అమ్ముకోవడానికి వీలుగా ఉంటుంది.. దాంతోపాటు ఈ మధ్యకాలంలోనే సీఎం గోగుల్లంక వారిదికి శంకుస్థాపన చేశారు.. ఈ వంతెన నిర్మాణానికి టెండర్లు పిలవగా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు.. దాంతో వాటి పనులు కూడా ప్రారంభం కాలేదు.. పడవలు ,పంట్లు మీద దాటించాలంటే లంక గ్రామస్తుల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా రావాలన్నా వెళ్లాలన్న తలకు మించిన భారం అవుతుంది..

# రన్నింగ్లో ఊడిపోయిన సత్యవేడు ఆర్టీసీ బస్సు టైర్లు

చిత్తూరు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయండి. సురక్షితంగా గమ్యం చేరండి అంటూ పెద్ద ఎత్తున ఆర్టీసీ యాజమాన్యం ప్రచారం చేస్తున్న విషయం జగద్వితమే. ఇందుకు ఆర్టీసీ సంస్థలో సురక్షితులైన డ్రైవర్లు,సాంకేతిక సిబ్బంది ఉండటమే ప్రధాన కారణంగా ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. కానీ ఆర్టీసీ బస్సు మరమతుకు గురైనప్పుడు వాటిని బాగు చేసే విషయంలో డిపో గ్యారేజ్లో పనిచేస్తున్న మెకానికల్స్ నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇందుకు గురువారం రాత్రి సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలం సుబ్బానాయుడు కండ్రిక వద్ద చోటు చేసుకున్న సంఘటన తార్కాణంగా నిలుస్తుంది. వివరాలు ఇలా.. సత్యవేడు డిపోకు చెందిన ఆర్టిసి బస్సు తిరుపతి నుంచి సత్యవేడుకు వస్తుండగా మార్గమధ్యలో సుబ్బానాయుడు కండ్రిక గ్రామానికి సమీపంలో గురువారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో బస్సు వెనుక టైర్లు ఊడిపోయాయి. దీంతో బస్సు పక్కకు ఒరిగిపోయి నిలిచిపోయింది. అదృష్టవశాత్తు ఎదురుగా, వెనుక వైపు ఎలాంటి వాహనాలు రాకపోవడంతో ప్రయాణికులు ప్రమాదానికి గురి కాకుండా సురక్షితంగా బయటపడ్డారు. ఒకవేళ టైర్లు ఊడిపోయిన సమయంలో వాహనాలు ఎదురుగా వచ్చి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని ప్రయాణికులు పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా సత్యవేడు

### ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు

డిపో గ్యారేజీలో దాదాపు 30 మంది మెకానికల్స్ పనిచేస్తున్నట్లు సమాచారం. ఇంతమంది సాంకేతిక సిబ్బంది ఉన్న టైర్లకు సంబంధించిన నట్లు సరిగా బిగించకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించాయని ఆర్టీసీ వర్గాలే చెప్తున్నాయి. డిపో గ్యారేజ్ నుంచి బయటికి వచ్చే ప్రతి బస్సును బ్రేకులు, స్టీరింగ్, టైర్లు, ఆయిల్స్ తదితర వాటిని మెకానికల్స్ పరిశీలించాల్సి ఉంది. అయితే గురువారం ఏపీ 39 జడ్ 0281 నెంబర్ గల ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి సత్యవేడు వైపు వస్తుండగా సుబ్బానాయుడు కండ్రి వద్ద వెనుక బాగానే ఉన్న రెండు టైర్లు ఊడిపోయాయి. దీంతో బస్సులోని ప్రయాణికులు ఆందోళనకు గురి అయ్యారు.అయితే వెనుక ముందు ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.అయితే బస్సు టైర్ల బిగింపులో సంబంధిత మెకానికల్స్ అశ్రద్ధ, నిర్లక్ష్యం వహించడం వల్లే ఇలాంటివి చోటు చేసుకున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఆర్టీసీ ఉన్నత అధికారులు స్పందించి ఇలాంటివి మళ్లీ పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

# తోడికోడళ్ల మర్డర్ను ఛేదించిన పోలీసులు

కర్నూలు కోట్ల కొద్ది ఆస్తి. ఇద్దరు కొడుకులు ఉన్నా.వారి అనంతరం అనుభవించడానికి మనవళ్లు లేరనే బాధ. ఈ ఒక్క కారణమే.. ఇద్దరి ప్రాణాలు తీసేలా చేసింది. చిన్న ట్రిక్కును ప్లే చేసి కట్టుకున్న భర్తలతోనే భార్యలను మట్టుబెట్టించాడు తండ్రి. పక్కా ప్లాన్ చేసి ఇద్దరి కోడళ్లను హత్య చేసినా.. చేసిన పాపం ఊరికే పోదన్నట్లు.. వాళ్లు వేసుకున్న ఓ పాదరక్ష ముగ్గురిని కటకటల్లోకి నెట్టింది. కర్నూల్ జిల్లాలో కలకలం సృష్టించిన ఈ దారుణ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.ఓర్వకల్లు మండలం నన్నూరుకు చెందిన కురువ గోగన్న, మంగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. ఐదేళ్ల క్రితం పెద్ద కుమారుడు పెద్ద గోవిందుకు రామేశ్వరితో, మూడేళ్ల క్రితం చిన్న రామ గోవిందుక్కు రేణుక వివాహం అయింది. అయితే ఇద్దరికి పెళ్లై ఏళ్లు గడుస్తున్నా సంతానం కలగలేదు. ఈ కుటుంబానికి నేషనల్ హైవేలో రూ.60 కోట్ల విలువైన 10 ఎకరాలతోపాటు గ్రామంలో మరో 30 ఎకరాల భూమి ఉంది. కోట్లలో ఆస్తులు ఉన్నా వాటిని అనుభవించడానికి సంతానం లేదని తల్లిదండ్రులు తరచూ బాధపడేవారు. ఇదే సమయంలో కోడళ్లు ఇంట్లో అడుగు పెట్టినప్పటి నుంచి తన ఆరోగ్యం కూడా బాగుండటం లేదని, తనకు కోడళ్లు చేతబడి చేయించారని మామ గోపన్న బలంగా నమ్మాడు. ఈ క్రమంలో ఇద్దరి కొడుకులకు మరో పెళ్లి చేయాలని ప్లాన్ వేశాడు తండ్రి.

### చెప్పు లతో బయటపడిన క్రైమ్

అందుకు కోడళ్లు అడ్డు వస్తున్నారని భావించి వారిద్దరిని అడ్డుతొలగించుకునేందుకు పక్కా స్కెచ్ వేశాడు. కొడుకులకు మామ మాటలు చెప్పి వారి భార్యలను కడతేర్చేందుకు ఒప్పించాడు. ఇందులో భాగంగా ఈ నెల 14న కోడళ్లతో కలిసి గ్రామ సమీపంలోని తమ పొలం వద్దకు మామ, కొడుకులు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో కోడళ్లను గడ్డికోయమని చేనులోకి పంపించిన మామ.. వెనకాలే కుమారులతో కలిసి వెళ్లి మొదట పెద్ద కోడలు రేణుక తలపై బలంగా కర్రలతో కొట్టి హత్య చేశారు. దానిని చూసిన చిన్న కోడలు ఆ దారుణాన్ని అడ్డుకోబోవడంతో ఆమె ఛాతీపై కొట్టి దారుణంగా చంపేశారు. అనంతరం మృతదేహాలను అక్కడే వదిలేసి ఇంటికి వెళ్లిపోయారు. తండ్రి గోపన్న ఏమి తెలియనట్టు ఆరోగ్యం బాగలేదని ఆస్పత్రిలో చేరగా.. కొడుకులు ఇద్దరు తమ భార్యలను ఎవరు హత్య చేశారని నాటకానికి తెర లేపారు. అయితే మామ గోపన్న వ్యవహార శైలి అనుమానస్పదంగా ఉండటం.. హత్య స్థలంలో పెద్ద గోవిందు చెప్పు లభించడంతో పోలీసులు తమదైన శైలిలో విచారించారు. దీంతో గోపన్న స్కెచ్ బయటపడింది. దీంతో పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.

## తిరుచానూరులో భక్తుల సౌకర్యాల కోసం దీర్ఘకాలిక ప్రణాళికలు

### - జెఈఓ వీరబ్రహ్మాం

తిరుపతి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి రాబోయే రోజుల్లో భక్తుల రద్దీ పెరిగే ఆకాశం ఉన్నందున వసతులు పెంచేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని టిటిడి జెఈవో వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఎఫ్ఎ అండ్ సీఈవో బాలాజితో కలిసి ఆయన తనిఖీలు నిర్వహించారు. యాగశాలలో నిరుపయోగంగా ఉన్న సామగ్రిని తొలగించడం వల్ల ప్రదక్షిణ చేయడానికి సౌకర్యంగా ఉందన్నారు. ప్రసాదాల పంపిణీ కేంద్రాల వద్ద క్యూలైన్లలో భక్తులు ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆలయంలో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని అదనపు ఆరోగ్యాధికారికి సూచించారు. ఫ్రైడే గార్డెన్లో దిగుడు బావిని పరిశీలించి పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. బావిలోని ఊట నీరు ఆలయ అవసరాలకు ఉపయోగపడతాయేమో పరిశీలన జరపాలని అధికారులకు సూచించారు. అనంతరం పూలమాలల తయారీ ప్రాంతం, పిండి మర, విద్యుత్ గదిని పరిశీలించారు. ఈ ప్రదేశాలు భక్తుల అవసరాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అమ్మవారి ఆలయ పుష్కరిణి సందర్శించి అక్కడ చేయాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. తోళప్ప గార్డెన్, వాహన మండపం వద్ద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు.

# వైభవంగా సాగుతున్న సహస్ర చండీ యాగం

కావలి నెల్లూరు జిల్లా కావలి పట్టణం తుమ్మలపెంటరోడ్లోని స్కంధ ఫ్రైడ్... వరహా వెంచర్స్ ప్రాంగణంలో ప్రారంభమైన సహస్ర రుద్ర సహిత సహస్ర చండీ యాగం శాస్త్రోక్తంగా సాగుతుంది. దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన రుత్విక్కులు, వేదపండితులు నియమబద్ధంగా యాగాన్ని జరిపిస్తున్నారు. యాగకర్తలైన మన్నెమాల సుకుమార్ రెడ్డి, కల్పన దంపతులు యాగప్రవేశం చేసి విఘ్నేశ్వరపూజ, నవగ్రహ హోమం, ఇతర హోమాలు నిర్వహించి చండీ హోమంలోని తొలి అంకాన్ని పూర్తి చేశారు. రెండో రోజైన శుక్రవారం అమ్మవారు 'శైలపుత్రి' అలంకరాంలో దర్శనమిచ్చారు. నవదుర్గ అవతారాల్లో శైలపుత్రి అవతారమే మొదటి అవతారం. సాక్షాత్తు పార్వతీదేవినే శైలపుత్రి అవతారంగా భావిస్తారు. మహిషాసురున్ని సంహారించేందుకు కూడా అమ్మవారు శైలపుత్రిగా పార్వతీదేవి అవతారంలోనే రావడం విశేషం. అంతటి శక్తివంతమైన అమ్మవారు కావడం, నవదుర్గల్లో తొలిఅవతారం కావడంతో చండీ యాగంలో కూడా తొలిరోజున అమ్మవారిని శైలపుత్రి అలంకారంలోనే ఆరాధించారు. కుడి చేతిలో త్రిశూలం, ఎడమ చేతిలో కమలం ధరించి వృషభవాహనంపైన కొలువుదీరిన అమ్మవారు భక్తులకు అభయప్రదాయనిగా, చెడును సంహరించే ఆదిశక్తిగా దర్శనమిచ్చారు.శైలపుత్రి అలంకారంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రుత్విక్కులు, వేదపండితులు చండీ పారాయణం, చతుర్వేద పారాయణం, మహాన్యాస పూర్వక, అన్యోన్య సహిత శత రుద్ర పారాయణం, అమృత మహా పాశుపతం, జపాభిషేకం నిర్వహించారు. అనంతరం సంతాన గోపాల జపం, గణపతి హోమం, రుద్రహోమం, పాశుపత సహిత చండీ హవనం, రుద్ర హోమం, న వగ్రహ హోమం, విశేష అర్చన, శ్రీయంత్రం, పూజహోమం, నాగహారతి నిర్వహించారు.పవిత్రత ఉట్టిపడేలా యాగస్థలిసహస్ర చండీ యాగం నిర్వహిస్తున్న వరహా వెంచర్స్ ప్రాంగణం అంతా హోమాలు, చండీ పారాయణాలు, వేదమంత్రాలతో పవిత్రత నెలకొంది. హోమద్రవ్యాల ప్రభావంతో పరిసరాల్లో వివరించలేని ప్రశాంతత అలుముకుంది. ఒకవైపు హోమగుండాల నుంచి వస్తున్న పరిమళం, మరోవైపు అమ్మవారి నామస్మరణలు భక్తులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.

# సమాధి పగల గొట్టి...

ఏలూరు, డిసెంబర్ 16, (న్యూస్ పల్స్)పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో దారుణం చోటు చేసుకుంది. ఓ వ్యక్తి తన తండ్రి సమాధి పగుల గొట్టి పుర్రెను బయటకు తీశాడు. ఆపై దాన్ని ఫొటోలు తీసి వాట్సాప్ ద్వారా తన స్నేహితులకు పంపించాడు. అయితే అతడిపై తన సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నరసాపురం మండలం రుస్తుంబాదకు చెందిన మురాలు జయ ప్రసాద్ గత ఏడాది జులై 13వ తేదీన మృతి చెందాడు. అతనిని క్రైస్తవ సంప్రదాయం ప్రకారం బాక్సులో పెట్టి ఖననం చేశారు. ఆపై సమాధి నిర్మించారు. జయ ప్రసాద్ మొదటి భార్య కుమారుడైన సుజయ్ ఈ నెల 9వ తేదీన తండ్రి జయ ప్రసాద్ సమాధిని పగుల గొట్టి శవ పేటికను తెరిచాడు. ఆపై పుర్రెను ఫొటో తీసి వాట్సాప్ ద్వారా స్నేహితులకు పోస్టు చేశారు. అయితే విషయం తెలుసుకున్న రెండో భార్య కుమారుడు సంజయ్.. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుజయ్ తమను కావాలనే అవమాన పరిచాడని, మానసికంగా ఇబ్బంది విధంగా ప్రవర్తించాడని పోలీసులకు వివరించాడు. కేవలం తండ్రి పుర్రెను ఫొటోలు తీయడమే కాకుండా ఊరంతా పుర్రెను చేత పట్టుకొని తిరిగినట్లు చెబుతున్నాడు. సంజయ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు."మా నాన్న రుస్తుంబాద్ గ్రామస్థుడు. పోయిన సంవత్సరం జులైలో ఆయన కాలం చేశారు. చనిపోతే మా సొంత స్థలంలో రుస్తుంబాద్ లో ఖననం చేశాం మా నాన్నగారిని. మా కో బ్రదర్ అయినటువంటి మురాల సుజయ్ ఆ సమాధిని లాస్ట్ మంత్ పగులగొట్టి, దాన్ని బ్రేక్ చేసి ఆ సమాధి లోపల ఉన్న ఆ హెడ్ తీసుకొని గ్రామంలో అంతా తిరిగాడు. మాకు జస్ట్ త్రీ డేస్ బ్యాక్ తెలిసింది. మేమిక్కడికి వచ్చి చూడగా.. సమాధి లోపల అంతా చిందరవందరగా ఉంది. సమాధిని మొత్తం పగుల గొట్టేసి ఆ హెడ్ కూడా వేరు చేసేశారు. దీనిపై మేం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాం. సీఐ కూడా వెంటనే ఎఫ్ఐఆర్ ఫైల్ చేసి అరెస్ట్ చేశారు. కానీ బెయిల్ ఇచ్చి బయటకు పంపించారు. ఇలాంటి వ్యక్తి సమాజంలో తిరగడం చాలా దారుణం" - మురాల సంజయ్, రెండో భార్య కుమారుడుజయ ప్రసాద్ రెండో భార్య కుమారుడు సంజయ్.. మరోసారి తండ్రి సమాధిని కట్టించారు. మరోసారి ఇలాంటి చర్యలు జరగకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. నిందితుడు సుజయ్ ను కఠినంగా శిక్షించాలని కోరారు. అరెస్ట్ చేసినట్లు చేసి మళ్లీ బయటకు పంపించడం సరికాదన్నారు. ఇలా పిచ్చి పిచ్చిగా ప్రవర్తించే వారు సమాజంలో తిరిగితే చాలా ప్రమాదం అని అన్నారు. మానసిక స్థితి సరిగ్గా లేకే ఆయన ఇలా చేశాడేమో అని అనుమానం వ్యక్తం చేశారు.

# అక్వా రైతులు అల్టిమేటం

ఏలూరు, డిసెంబర్ 16, (న్యూస్ పల్స్) ఆక్వా రైతులు కష్టాలను ప్రభుత్వం పట్టించుకోకుంటే క్రాప్ హాలిడే ప్రకటిస్తామని ఆక్వా రైతులు హెచ్చరించారు. ఆక్వా రైతు పోతుల నరసింహా రావు ఆధ్వర్యంలో పలువురు రైతులు గురువారం రోజు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గుండిపూడి గ్రామంలో సమావేశం అయ్యారు. ఆక్వా రైతులు పడుతున్న కష్టాలను ప్రభుత్వం, ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఆక్వారంగంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గత 30 ఏళ్లుగా ఎప్పుడూ ఈ పరిస్థితి చూడలేదని నరసింహరావు అన్నారు. కరోనా సమయంలో రైతుల పరిస్థితిని గాలికొదిలేశారని, మూడేళ్ల పాటు జగన్ అధికారంలోకి వచ్చాక రైతులు మరిన్ని కష్టాలు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్ర ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే 25 కిలోల ఫీడ్ బ్యాగు రూ. 2800 ధర పలుకుతుందని, రాష్ట్రానికి విదేశీ కరెన్సీ వస్తుందంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణం అని పోతుల నరిసింహారావు పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల కోట్లు వరకు కరెన్సీ వస్తుందన్నారు. విద్యుత్ పర్మిషన్లు ఇవ్వడంలోనూ ఇబ్బందులు ఉన్నాయని, సబ్సిడీ రూపాయిన్నర ఇచ్చి యూనిట్ ధర పెంచారని ఆరోపించారు. నాణ్యమైన విద్యుత్తు ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో చాలా సునాయసంగా విద్యుత్తు కనెక్షన్ కోసం పర్మిషన్ ఇచ్చేవారని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గత మూడేళ్ల నుంచి వంద శాతం నుంచి జీరోకు వచ్చిన పరిస్థితి ఉందని, 23 మంది ఎంపీలు ఉన్నా పార్లమెంటులో ఆక్వా రైతుల సంక్షోభంపై మాట్లాడిన దాఖలాలు లేవని వాపోయారు. ఆక్వా రంగం కూడా క్రాఫ్ హాలిడీ ప్రకటిస్తే రెండున్నర కోట్ల మంది ప్రజలు రోడ్డున పడే పరిస్థితి ఉందని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈనెలాఖరు నాటికి ఆక్వా రైతులు క్రాఫ్ హాలిడే ప్రకటిస్తామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ఆక్వా రైతులు తగిన బుద్ధి చెబుతారని మండిపడ్డారు. రాష్ట్రంలో రైతు పదేళ్లు వెనక్కు వెళ్లిన పరిస్థితి కనిపిస్తోందని, రాబోయే రోజుల్లో జగన్మోహన్ రెడ్డిని ఇంటికి పంపించే పరిస్థితి తలెత్తుతుందన్నారు. రాష్ట్రంలో 70 శాతం మంది వ్యవసాయంపై ఆధార పడుతున్నారని వివరించారు. వరికి కిట్టుబాటు ధర రావాలని క్రాఫ్ హాలిడే ప్రకటించామని.. ఇటీవలే 50 వేల ఎకరాల్లో వరి ఊడ్చలేదని ఊడ్చిన వారు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. ప్రభుత్వం దృష్టిసారించి వరికి కిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.కోనసీమ ప్రాంతంలో మూడు పంటలైన వరి, ఆక్వా, కొబ్బరి ఈమూడు పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, అనేక ఆంక్షలతో ఆక్వా పరిశ్రమను ఇబ్బందులపాలు చేస్తున్నారని పోతుల నరసింహా రావు అన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా కార్పోరేట్ సంస్థలనే చూస్తున్నారని, క్వాలిటీ లేని హేచరీలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆక్వారంగం కూడా మద్దతు ధర కోసం పాకుపాలడాల్సిన పరిస్థితి దాపురించిందని, పెరిగిపోతున్న ఫీడ్, విద్యుత్తు ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. రైతులకు మేలు కలిగే విధంగా ప్రభుత్వం ప్రయత్నించాలన్నారు.

# విద్యార్థి ఆత్మ హత్య

### - కళాశాల ఎదుట విద్యార్థుల సంఘాలు ఆందోళన

గద్వాల జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని శ్రీ కృష్ణ వేణి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి కళాశాల యాజమాన్యం ఒత్తిడి భరించలేక వెంకటేష్ శుక్రవారం తెల్లవారుజామున ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ధరూర్ మండలం గార్లపాడు గ్రామానికి చెందిన వెంకటేష్ (17) తండ్రి మల్లేష్ గద్వాల పట్టణంలోని శ్రీకృష్ణవేణి జూనియర్ కళాశాలలో చదువుతున్నాడు. గురువారం కళాశాల ముగిసిన తర్వాత జిల్లా కేంద్రంలోని గంజిపేట కాలనీలో అద్దెకి తీసుకున్న రూముకు వెళ్ళాడు. రూమ్ లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వాళ్ళు తన స్నేహితులు గమనించి అంబులెన్స్ సమాచారం ఇవ్వడంతో కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల ఎదుట ధర్నా చేపట్టారు. విద్యార్థి మృతికి కళాశాల యాజమానమే కారణమని ఆరోపించారు. కళాశాల యాజమాన్యం విద్యార్థినీ విద్యార్థుల పట్ల అసభ్యకరంగా మాట్లాడడం తోనే విద్యార్థి మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ఫీజులు వసూలు చేయడం తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేయడం ఈ కళాశాల యాజమాన్యం చేస్తోందని ఆరోపించారు.

## తిప్పగుంట గ్రామంలో ఎమ్మెల్యే పర్యటన

తిరుపతి చిల్లకూరు మండల పరిధిలోని తిప్పగుంట పాలెం గ్రామ సమీపంలో ఉన్న కండలేరు వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద రావు తిప్పగుంట పాలెం గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు .తిరుపతి జిల్లా తిప్పగుంట పాలెం గ్రామంలోని రేషన్ కార్డ్ హోల్డర్లకు ఉచితంగా 25 కేజీల బియ్యం , ఒక కేజీ కందిపప్పు , ఒక కేజీ వంట నూనె చొప్పున 370 కుటుంబాలకు పంపిణీ చేశారు.తుఫాన్ బాధితులకు ప్రభుత్వం అందజేస్తున్న నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం తిప్పగుంట పాలెం గ్రామంలో నిర్వహించారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు మీడియాతో మాట్లాడుతూ తుఫాన్ బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు . ప్రతి సంవత్సరం వర్షాలు కురిసిన సమయంలో తిప్పగుంట పాలెం గ్రామం జల దిగ్బంధంలో ఉండి పోతుంది కనుక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి గ్రామ సమీపంలో కండలేరు వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపడతామని తెలిపారు . ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ స్వర్ణ , సర్పంచ్ సుమంత్ రెడ్డి , జెడ్ పి టి సి శ్రీనివాసులు , వైస్ ఎంపీపీ కుమారస్వామి రెడ్డి , వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు .

## అమీన్ పీర్ దర్గాను దర్శించిన మంచు మనోజ్

కడప ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కడప అమీన్ పీర్ దర్గాను సిని హీరో మంచు మనోజ్ శుక్రవారం దర్శించుకున్నారు. దర్గా సంప్రదాయం ప్రకారం హీరో మంచు మనోజ్ తలకు పాగా చుట్టి దర్గా ముజావర్లు ఘనంగా స్వాగతం పలికారు. అయన దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి, దర్గా విశిష్ఠతను అడిగి తెలుసుకున్నారు. కడప దర్గాకు రావడం చాలా ఆనందంగా ఉంది. త్వరలోనే కొత్త జీవితం ప్రారంభించ బోతున్నానని మనోజ్ అన్నారు.

# కామన్ సివిల్ కోడ్ పై దేశ వ్యాప్తంగా లౌకిక వాదులతో చర్చ జరగాలి



కడప అర్బన్ డిసెంబర్ 16: కామన్ ఉమ్మడి సివిల్ కోడ్ పై దేశ వ్యాప్తంగా ప్రజాస్వామ్య లౌకిక వాదులతో చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా లీగల్ సెల్ చైర్మన్ వై రమేష్ బాబు అన్నారు గురువారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు నేడు కామన్ సివిల్ కోడ్ పేరుతో కేంద్ర బిజెపి ప్రభుత్వం దాని అనుబంధ సంస్థలు మను సివిల్ కోడ్ ను కామన్ సివిల్ కోడ్ గా తీసుకొచ్చేందుకు దుర్మార్గపు ఆలోచన కు తెరలేపాలని చూస్తోందని చెప్పారు వివిధ కులాలు, మతాలు, సాంప్రదాయాలు కలిగిన భారత దేశం లో బిజెపి ప్రభుత్వం ప్రవేశ పెట్టాలనుకున్న కామన్ సివిల్ కోడ్ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనా విధానానికి పూర్తి వ్యతిరేక మన్నారు మతానికి పెళ్లిళ్లకు, విడాకులకు, ఆస్తికి , భౌతిక హక్కుల కు సంబంధం ఉండకూడదని డాక్టర్ అంబేద్కర్ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు ముఖ్యంగా జిజెపి ప్రవేశపెట్టాలని

### లీగల్ సెల్ చైర్మన్ వై రమేష్ బాబు

చూస్తున్న కామన్ సివిల్ కోడ్ కుల వ్యవస్థ హిందూమతాన్ని సమర్థించే విధంగా వుందని ఇది ముస్లిం మైనారిటీలకు,దళితుల సంస్కృతి కి తీవ్రంగా విఘాతం కలిగించే విధంగా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు కావున రాజ్యాంగ నిపుణులు అంబేద్కరిస్టులు, అంబేద్కర్ ఆలోచనా సరళి తో కూడిన వివిధ సామాజిక వర్గాలను దృష్టిలో ఉంచుకుని అందరికీ ఆమోదయోగ్యమైన మేధావులతో చర్చించాలని కోరారు ఇందులో మత విధానాలపై కులం విధానాల పై సామాజిక కార్యకర్తలు, లౌకిక వాదులతో చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు హిందూత్వం లో పూర్తి గా కులవ్యవస్థ ఉందని వాపోయారు దీనిని రూపుమాపేందుకు అందరూ కృషి చేయాలని కోరారు

## హర్బర్ దగ్గర ఉద్రిక్తత

విశాఖపట్నం విశాఖ హార్బర్ వద్ద అర్ధరాత్రి ఉద్రిక్తత నెలకొంది. రాత్రి దాదాపు 8 గంటల నుంచి విషవాయువులు లీక్ అవ్వడం కలకలం రేపింది. విషవాయు వులు లీక్ కావడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ప్రాణ భయంతో మత్స్యకారులు పరుగులు పెట్టారు.ఈ క్రమంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ అండ్ ట్రైనింగ్ వద్ద మత్స్యకారులు ఆందోళ నకు దిగారు. సమా చారం అందుకున్న పోలీసులు భారీగా మోహరించారు. అదే సమయంలో లోపలికి వెళ్లే ప్రయ త్నం చేయగా మత్స్యకారులను పోలీసులు అడ్డుకున్నారు. మరోవైపు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు ఫైర్ ఇంజిన్, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అయితే నగరంలో మరోసారి విష వాయువు లీక్ కావడం కలకలం రేపింది.

# ఏపీలో ఇక సీబీఎస్ఈ సిలబస్సే

విజయవాడ, డిసెంబర్ 16, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం (2023-24) నుంచి 1 నుంచి 7 తరగతులకు సీబీఎస్ఈ సిలబస్ పాఠ్య పుస్తకాలు తీసుకురావాలని ఏపీ పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ప్రస్తుతం ఎనిమిదో తరగతిలో ఈ విధానాన్ని అమలు చేస్తుండగా, ఇకపై అన్ని తరగతులకు సీబీఎస్ఈ పుస్తకాలనే అందించాలని విద్యాశాఖ భావిస్తోంది. ఈ మేరకు గురువారం (డిసెంబరు 15) నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయించారు. 1 నుంచి 7 తరగతులకు మ్యాథమ్యాటిక్స్, ఇంగ్లిష్ టెక్ట్స్ బుక్స్, 6, 7 తరగతులకు జనరల్ సైన్స్ సబ్జెక్టులకు సంబంధించి సీబీఎస్సీ సిలబస్తో కూడిన కొత్త పాఠ్యపుస్తకాలు ఇస్తారు. సోషల్ సైన్సెస్ మాత్రం రాష్ట్ర (ఏపీ చరిత్ర) సిలబస్ ఉంటుంది. సీబీఎస్ సిలబస్లో దేశ చరిత్ర మాత్రమే ఉంటుంది. అందువల్లనే సోషల్ సబ్జెక్టును మినహాయించి మిగతా వాటికి సీబీఎస్ఈ సిలబస్తో పాఠ్యపుస్తకాలు ఇస్తారు.సాధారణంగా ఎన్సీఈఆర్టీ పాఠ్య పుస్తకాలను సీబీఎస్ఈ అనుసరిస్తుంది. ఎనిమిదో తరగతి నుంచే సీబీఎస్ఈ ప్రత్యేకంగా పాఠ్యపుస్తకాలను రూపొందిస్తోంది. కింది తరగతులకు ఎన్సీఈఆర్టీ సూచించిన సిలబస్ ఆధారంగా పాఠ్య పుస్తకాలను అందిస్తారు. వచ్చే ఏడాది (2023) నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు కూడా వీటినే అందిస్తారు. బోర్డు అనుమతి లేని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రం సీబీఎస్ఈ సిలబస్ చదివినా రాష్ట్ర బోర్డు పరీక్షలే రాయాల్సి ఉంటుంది. సీబీఎస్ఈ బోర్డు పరీక్షలు రాయాలంటే ఆయా విద్యాసంస్థలు బోర్డు అనుమతి తీసుకోవల్సి ఉంటుంది.

# సైకో సెల్ఫీ

నరసాపురం దీన్ని సైకో తత్వం అంటారో.. లేక పైశాచిక ఆనందం అనాలో గాని .. ఓ ప్రబుద్ధుడు తండ్రి సమాధిని పగలగొట్టి.. పుర్రెను ఫోటో తీసి సోషల్ మీడియాలో షేర్ చేశారు. ..పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం దుస్తుం బాదలో చోటు చేసుకున్న ఈ సంఘటన పలువురిని కలవరపరిచింది.. గ్రామానికి చెందిన మురాల జయప్రసాద్ ఏడాది క్రితం కాలం చేశారు. ఆయన భౌతిక కాయాన్ని సొంత పొలంలోనే సమాధి చేశారు.. మృతుని మొదటి భార్య కుమారుడు సుజయ్ గత నెలలో తండ్రి సమాధిని ధ్వంసం చేసి పుర్రెను సెల్ఫీ తీశాడు. దాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. దీన్ని గుర్తించిన సోదరుడు సంజయ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు కేసు నమోదు చేసిన నర్సాపురం రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు

# అలరించిన విద్యవైజ్ఞానిక ప్రదర్శన



ఆత్మకూరు... ( డిసెంబర్ 16 శుక్రవారం ).నెల్లూరు జిల్లా ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శన స్టాలనా స్థానిక మండల విద్యాధికారి నజీర్ ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు సృజనాత్మకత ఉట్టి పడేలా తమ మేధస్సును పదును పెట్టి ప్రదర్శించిన ఎగ్జిబిట్స్ విద్యార్థిని విద్యార్థులను ఎంతగానో ఆలోచింప చేశాయి. ఈ సందర్భంగా యంఈఓ నజీర్, ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసు, కరకంపాడు హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ తరగతి గదులకు, పాఠ్యపుస్తకాలకు పరిమితం కాకుండా వారిలో దాగిన సృజనాత్మకతను ప్రదర్శించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని మండల స్థాయిలో ఐదు మందిని ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపించడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో ఎంపికైన ఐదు మందిని జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయిలో జరిగే విద్య వైజ్ఞానిక సదస్సులో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు తెలియజేశారు.

## అంగనవాడి కేంద్రాలలో ప్రభుత్వ మెనూ తప్పనిసరి

### అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ భూ హక్కు భూ సర్వే పనుల పరిశీలన

నందికొట్కూరు. డిసెంబర్ 16 అంగన్వాడి కేంద్రంలో నాణ్యమైన భోజనం అందించాలని నందికొట్కూర్ మున్సిపల్ కమిషనర్ పి కిషోర్ శుక్రవారంనందికొట్కూరు పట్టణంలోని పగిడాల రోడ్ లో ఉన్న 11వ వార్డు అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అంగన్వాడీ కార్యకర్తల హాజరు శాతాన్ని, పిల్లలకి అందిస్తున్నటువంటి మెనూ రిజిస్టర్ను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పిల్లల కొరకు వండిన అన్నాన్ని పిల్లలకు స్వయంగా పరిశీలించి ప్రభుత్వా అందించిన మెనూ ప్రకారం నాణ్యమైన బియ్యం,కోడిగుడ్లు, పాలు, కూరగాయలను పరిశీలించి గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు,పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలనిసూచించారు. అదేవిధంగా బాలింతలకు గర్భిణీలకు జగనన్న కిట్లు పంపిణీలో అవకతవకం లేకుండా ప్రతి ఒక్కరికి అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వార్డు పరిధిలోని ప్రతి ఇంట్లో ఉన్న పిల్లలను అంగన్వాడి సెంటర్కు వచ్చి విద్యను అభ్యసించేందుకుఅవగాహన కల్పించి తల్లిదండ్రులతో మాట్లాడి అంగన్వాడి సెంటర్కు వచ్చే విధంగా ప్రేరేపణ కలిగించాలన్నారు.

# బైక్ దొంగలు అరెస్టు



## రఘువీరారెడ్డి నంద్యాల జిల్లా ఎస్పీ

నంద్యాల :-జిల్లాలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు అరెస్టు చేశారు. 27 మోటార్ సైకిల్లు స్వాధీనము వాటి మొత్తము విలువ సుమారు 10,80,000/-. ఈ కేసులో చాకచక్యముగా వ్యవహరించి చోరీకి పాల్పడిన వారిని పట్టుకోవడములో ప్రతిభ చూపించిన పోలీసు సిబ్బందిని అభినందించిన ఎస్పీ. నంద్యాల్ జిల్లా లోని నంద్యాల టౌన్, కోయిలకుంట్ల, కొలిమిగుండ్ల, సంజామల, అవుకు, పాణ్యం పోలీసు స్టేషన్ ల పరిధిలో, కడప జిల్లాలోని ప్రొద్దుటూరు, మైలవరం, జమ్మలమడుగు పోలీసు స్టేషన్ ల పరిధిలో బైక్ లు మరియు అనంతపురం జిల్లాలోని తాడిపత్రి పోలీసు స్టేషన్ ల పరిధిలో చోరీలకు అలవాటుపడ్డ ముగ్గురు దొంగలు చాకలి సుంకన్న, వయస్సు: 37 సం,,లు, తండ్రి: లక్ష్మన్న, గుడిపాడు గ్రామము, యాడికి మండలము, అనంతపూరు జిల్లా. అరవ తిరుపాలు, వయస్సు: 25 సం,,లు, తండ్రి: నాగన్న, గొరివిమాను పల్లె గ్రామము కొలిమిగుండ్ల మండలము. మైల ఈశ్వరయ్య, వయస్సు: 30 సం,,లు, తండ్రి: గంగన్న, గొరివిమాను పల్లె గ్రామము, కొలిమిగుండ్ల మండలము. గౌరవ డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి గారు మరియు గౌరవ డిఐజి సెంథిల్ కుమార్ గారి సూచనల మేరకు నంద్యాల జిల్లా గౌరవ ఎస్పీ శ్రీ రఘువీర్ రెడ్డి గారి ఆదేశాల మేరకు నంద్యాల డీయస్పీ శ్రీ మహేశ్వర్ రెడ్డి గారి ఆద్వర్యం లో నంద్యాల ఎవి టౌన్ సీఐ గారు .ప్రభాకర్ రెడ్డి, నంద్యాల 1 టౌన్ గారు బి ఆర్ .కృష్ణయ్య, సిసి ఇన్స్పెక్టర్ రామకృష్ణ , నంద్యాల 1 టౌన్ ఎస్సై .సుబ్బరామి రెడ్డి , నంద్యాల ఎవి టౌన్ ఎస్సై హరిప్రసాద్ మరియు సిబ్బంది వారికి రాబడిన సమాచారము మేరకు గురువారం నంద్యాల టౌన్ ఉరిబయట యల్ కె అర్ . పంక్షన్ హాల్ దగ్గర, పై న తెలిపిన ముద్దాయిలను పట్టుకొని వారిని విచారించగా వారు నంద్యాల టౌన్ ముల్లాన్ పేట లోని బాలాజి స్కూల్ దగ్గర 03.11.2022 వ తేది రాత్రి"ంఖ 21 ఖీ 8402" గా ాజజిజఐఎ ను దొంగతనము చేసి, అమ్ముకొనుటకు పోతుండగా వారిని పట్టుకొని బైకు ను స్వాధీన పరచు కోవడమైంది.? విచారణలో భాగముగా వారు నంద్యాల్ జిల్లా లోని నంద్యాల టౌన్, కోయిలకుంట్ల, కొలిమిగుండ్ల, సంజామల, అవుకు, పాణ్యం పోలీసు స్టేషన్ ల పరిధిలో, కడప జిల్లాలోని ప్రొద్దుటూరు, మైలవరం, జమ్మలమడుగు పోలీసు స్టేషన్ ల పరిధిలో బైక్ లు మరియు అనంతపురం జిల్లాలోని తాడిపత్రి పోలీసు స్టేషన్ ల పరిధిలో మొత్తం 27 మోటార్ సైకిల్ లను దొంగతనము చేసినట్లు ఒప్పుకొవడము అయినది.? పైన పట్టుబడిన వాహనములతో పాటు 26 మోటార్ సైకిల్స్ ను ముగ్గురు ముద్దాయిల ఇండ్ల వద్ద కొలిమిగుండ్ల మరియు యాడికి మండలములో వాహనాలను స్వాధీనపరచుకొని 15.12.2022 వ తేది 18.00 గంటలకు నంద్యాల 1 టౌన్ పోలీసు స్టేషన్ నందు అరెస్ట్ చేయడమైనది. పైన తెలిపినా ముద్దాయిలు ఎక్కువగా రాత్రి పూట నంద్యాల్ జిల్లా లోని నంద్యాల టౌన్, కోయిలకుంట్ల, కొలిమిగుండ్ల, సంజామల, అవుకు, పాణ్యం మండలములలో, కడప జిల్లాలోని ప్రొద్దుటూరు, మైలవరం, జమ్మలమడుగు మండలములలో మరియు అనంతపురం జిల్లాలోని తాడిపత్రి మండలములలో అంతటా తిరుగుతూ తాళాలు ఉంచి మరచిపోయిన మోటార్ సైకిల్స్ లేదా వారి వద్ద ఉన్న మారు తాళము చెవి ద్వారా మోటార్ సైకిల్స్ లను స్టార్ట్ చేసి తీసుకెళ్లడము తక్కువ రేటుకు అమ్ముదామని నిర్ణయినీచుకున్నారు. ఈ 27 చోరీ కాబడిన వాహనాలలో 19 కేసులు ఇదివరకే నంద్యాల టౌన్, కోయిలకుంట్ల, కొలిమిగుండ్ల, సంజామల, అవుకు, పాణ్యం పోలీసు స్టేషన్ ల పరిధిలో, కడప జిల్లాలోని ప్రొద్దుటూరు, మైలవరం, జమ్మలమడుగు పోలీసు స్టేషన్ ల పరిధిలో బైక్ లు మరియు అనంతపురం జిల్లాలోని తాడిపత్రి పోలీసు స్టేషన్ లలో కేసు నమోదు చేయడము జరిగినది. ఈ కేసును ఛేదించడానికి సహకరించిన సిబ్బంది సుబ్బరామి రెడ్డి, మరియు సిబ్బంది ఆనందరావు, మస్తాన్, – మున్న, -2880 .యేసుదాస్, : 3270 మల్లేశ్వరెడ్డి, 257 .శాంతి రెడ్డి, 3651 షేక్ అమీర్ బాష, 1011 .శ్రీనివాస రెడ్డి, 1153 .నాగన్న లను నంద్యాల జిల్లా ఎస్పీ గారు ప్రత్యేకముగా అభినందించడమైనది.

## గుడ్డు నాణ్యత పరిశీలన


నంద్యాల :- నంద్యాల పట్టణంలో శుక్రవారం నాడు అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ పురపాలక ఉర్దూ పాఠశాల యందు మరియు అంగన్వాడీ సెంటర్లలో గుడ్డు నాణ్యతను పరిశీలించారు. పాఠశాల లో మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట షెడ్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. అంగన్వాడీ సెంటర్లలో కందిపప్పు ఆయిల్ ను పరిశీలించారు.

# మాండుస్ తుఫాను ప్రభావానికి గురైన రైతాంగాన్ని ఆదుకోండి.

### --జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి

నంద్యాల :-జిల్లాలో మాండుస్ తుఫాను ప్రభావానికి గురైన రైతాంగాన్ని ఆదుకోవాలని వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మార్కెట్ చైర్మన్ పి. పి. నాగిరెడ్డి, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల సంభవించిన మాండుస్ తుఫాను ప్రభావానికి గురైన వరి, ఎండు మిరప, మినుము తదితర పంటలు వేసి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులను ఆదేశించారు. జరిగిన నష్టాన్ని మానవతా దృక్పథంతో ఆలోచించి రైతులను అన్ని రకాలుగా ఆదుకోవాలని ఆయన సూచించారు. ప్రాథమికంగా గుర్తించిన 189 హెక్టార్లలో దెబ్బతిన్న వాణిజ్య పంటలకు నష్టపరిహారం అంచనా వేసి సంబంధిత ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. తనకు 30 ఎకరాల ఉద్యాన పంటలు ఉన్నాయని ఇప్పటివరకు ఏ ఒక్క హార్టికల్చర్ అధికారి క్షేత్రస్థాయిలో తన పొలాన్ని సందర్శించి ఎలాంటి సలహాలు ఇవ్వలేదన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గా వున్న నా పంటలనే సందర్శించనప్పుడు.... సామాన్య రైతులకు ఎలాంటి సేవలు అందిస్తారని ఆయన ప్రశ్నించారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉ ౦డి సరైన సలహాలిచ్చి దిగుబడి పెంచేందుకు కృషి చేయాలని వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులను ఆదేశించారు.సంజామల మండలంలో ఆధార్ అప్డేట్ కాకపోవడం వల్ల పిఎం కిసాన్ పరిహారం అందలేదని వారం రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆయన ఆదేశించారు. రబీ సాగుకైనా రైతులకు అవసరమైన టార్పాలిన్లు, తైవాన్ స్ప్రేలు అందజేయాలని డీఎఓను ఆదేశించారు. ప్రస్తుతమున్న పంటలను ఈ నెల కాపాడేందుకు అధికారులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. వ్యవసాయ అనుబంధ రంగాల జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి క్రింది స్థాయి సిబ్బందికి సూచనలు ఇస్తే విధుల్లో నిర్లక్ష్యం లేకుండా చిత్తశుద్ధితో, నిబద్ధతతో పనులు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయరంగ అభివృద్ధికి జిల్లాలో అపారమైన వనరులున్నాయని భవిష్యత్తులో నంద్యాలను వ్యవసాయక జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు తీవ్ర కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి మాట్లాడుతూ జిల్లాలో ఇన్సూరెన్స్ ప్రీమియం పొందని రైతులకు పరిహార మొత్తం చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావును ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, పశుసంవర్ధక శాఖ జెడి రమణయ్య తదితర వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పాల్గొన్నారు.

# డాల్బీ విజన్ 3డి గ్లాసెస్ లో పండోరా ఎలా కనపించనుంది?



అవతార్ 2 డిసెంబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. జేమ్స్ కామెరూన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా అసాధారణమైన ప్రీరిలీజ్ బిజినెస్ చేయడంతో వ్యాపార వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. హైదరాబాద్ సహా ఇరు తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ కోసం భారీ మొత్తాలు వెచ్చించిన తెలుగు రాష్ట్రాల పంపిణీదారుల్లోను బోలెడంత ఉత్కంఠ నెలకొంది. ఈ సినిమా తెలుగు స్టార్ హీరోల ను మించిన భారీ ఓపెనింగులతో ప్రారంభమవుతుందని అంతా అంచనా వేస్తున్నారు.ఇప్పుడు హైదరాబాద్ లోని సినీ ప్రియులకు ఓ శుభవార్త. అవతార్ 2 భారీ స్క్రీన్ స్క్రీనింగ్ లో వీక్షకులకు ప్రత్యేక 3డి గ్లాసెస్ ఇవ్వనున్నట్లు హైదరాబాద్ లోని ప్రసాద్ ఐమాక్స్ పెద్ద స్క్రీన్ వర్గాలు ప్రకటించాయి. ఇవి ప్రత్యేకంగా రూపొందించిన డాల్బీ విజన్ 3డి గ్లాసెస్ అని తెలిసింది. సినిమా వీక్షణ అనుభవాన్ని మహాద్భుతంగా పెంచే ఖ్యాతి ఈ గ్లాసెస్ కి ఉంది. కాబట్టి ఈ ప్రత్యేక సౌకర్యం సినీ ప్రేమికులను మరింత ఉత్కంఠగా వేచి చూసేలా చేస్తోంది.ఐమ్యాక్స్ లో అవతార్ చిత్రం దాదాపు 150 రోజులు పైగా ఆడింది. ఇప్పుడు సీక్వెల్ ఏ స్థాయిలో ఆడుతుందో చూడాలి. హైదరాబాద్ సహా విశాఖపట్నం-తిరుపతి-రాజమండ్రి- విజయవాడ-కరీనంగర్- వరంగల్ వంటి చోట్ల అవతార్ థియేటర్లకు ఫుల్ ఫ్లోటింగ్ కనిపిస్తోందని సమాచారం. అవతార్ కేవలం మెట్రోల్లోనే కాకుండా ఇటు టూటైర్ సిటీల్లోను వసూళ్ల హవా సాగించడం ఖాయంగా కనిపిస్తోందని ట్రేడ్ విశ్లేషిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో చిరంజీవి- బాలకృష్ణ సినిమాలకు లేని హైప్ ఈ సినిమాకి కనిపిస్తోందని ప్రముఖ ఉత్తరాంధ్ర పంపిణీదారు వ్యాఖ్యానించడం ఆసక్తికరం.ఆస్కార్ దర్శకుడి మొదటి రివ్యూ 2022 మోస్ట్ అవైటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'అవతార్ 2' మొదటి సమీక్ష ఇప్పటికే వచ్చేసింది! ఆస్కార్ గ్రహీత.. దర్శకుడు గిల్లెర్మో డెల్ టోరో స్పందన ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. అకాడమీ అవార్డ్ విజేత.. దర్శకుడు గిల్లెర్మో డెల్ టోరో 'అవతార్: ది వే ఆఫ్ వాటర్' మొట్టమొదటి సమీక్షను సోషల్ మీడియాలో అభిమానులతో షేర్ చేసారు. దీంతో అవతార్ అభిమానుల్లో మరింత ఉత్కంఠ పెరిగింది. జేమ్స్ కామెరూన్ దర్శకత్వం వహించిన చిత్రం అవతార్ 2 డిసెంబర్ 16న థియేటర్లలో విడుదల కానుండగా గిల్లెర్మో రివ్యూ ఒక్కసారిగా హీట్ ని పెంచింది. అవతార్ 2 చిత్రాన్ని ఇప్పటికే గిల్లెర్మో వీక్షించారు. ఈ చిత్రంపై తన మొదటి సమీక్షను షేర్ చేయగానే అది వైరల్ గా మారింది. వెంటనే ఈ సినిమాని 3డి విజువల్స్ లో చూడాలన్న కుతూహలాన్ని మరింతగా పెంచింది. అతను ఇలా రాసారు. "అత్యద్భుతమైన విజయం.. అవతార్ 2 గంభీరమైన .. భావోద్వేగాలతో కూడుకున్న గొప్ప సినిమా. ఇది పురాణేతిహాసాన్ని చూస్తున్నంతగా ఉక్కిరిబిక్కిరి చేస్తుంది" అని ప్రశంసించారు. అతడు శక్తుల శిఖరాగ్రంలో ఒక మాస్టర్...అంటూ కామెరూన్ పైనా ప్రశంసల జల్లు కురిపించారు. అవతార్ 2 మొదటి సమీక్షపై అభిమానులు స్పీడ్ గానే స్పందించారు "ఇది రాజ ముద్ర" అని "ఆమోద ముద్ర" అని వ్యాఖ్యల్ని జోడించారు.గిల్లెర్మో డెల్ టోరో ఈ చిత్రం వీక్షించిన అనంతరం ప్రశంసలు కురిపించారు. నిజానికి 'అవతార్: ది వే ఆఫ్ వాటర్' వర్క్ ఎట్టకేలకు పూర్తయిందని నిర్మాత జోన్ లాండౌ నవంబర్ 24న ట్విట్టర్ లో ప్రకటించారు. సినిమాకి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు అని రాశారు. దర్శకుడు గిల్లెర్మో డెల్ టోరో ఈ ప్రకటనపై ప్రతిస్పందించారు. చిత్రంపై తన మొట్టమొదటి సమీక్షను పంచుకుని మరింత ఉత్కంఠను పెంచారు. గిల్లెర్మో డెల్ టోరో హాలీవుడ్ లో సంచలన చిత్రాలను తెరకెక్కించిన మేధావి. ది షేప్ ఆఫ్ వాటర్- నైట్ మేర్ అల్లే-పాన్స్ లాబ్రింత్ వంటి చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. వచ్చే నెల ప్రారంభంలో తన తదుపరి చిత్రం 'పినోచియో' విడుదల కోసం వేచి చూస్తున్నాడు. అతడు తన తరంలో గొప్ప దృశ్య కథకులలో ఒకరిగా కూడా గుర్తింపు పొందారు.

# రాజమండ్రి లో మీనాక్షి చౌదరి చీర అందాలు



ఇచట వాహనాలు నిలుపరాదు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి. ఈ అమ్మడి యొక్క నటన మరియు అందంతో మొదటి సినిమాతోనే మెప్పించింది. ఆ తర్వాత ఖిలాడీ సినిమాలో కూడా నటించి మెప్పించింది. హీరోయిన్ గా ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత కు ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు.హిట్ 2 సినిమాలో అడివి శేష్ కు జోడీగా నటించి మరోసారి మీనాక్షీ చౌదరి మెప్పించింది. తాజాగా ఈ అమ్మడు రాజమండ్రిలో సందడి చేసింది. ముద్దుగుమ్మ చీర కట్టు లో ఏమాత్రం స్కిన్ షో చేయకుండా కూడా వావ్ అనిపించేంత అందంగా ఉంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి.ఎల్లో చీర కట్టు లో మీనాక్షి చౌదరి ని చూస్తూ ఉంటే చూపు తిప్పుకోలేకుండా ఉందంటూ కామెంట్స్ వస్తున్నాయి. వరుసగా ఈ అమ్మడికి ఆఫర్లు వస్తున్న నేపథ్యంలో బిజీ బిజీగా షూటింగ్ లో పాల్గొంటుంది. ఇటీవల ఒక సినిమా షూట్ లో భాగంగా రాజమండ్రిలో సందడి చేసిందనే వార్తలు వస్తున్నాయి. అధికారికంగా క్లారిటీ రావాల్సి ఉంది.ఇక ఈ అమ్మడు మిస్ ఇండియా గా నిలిచి బాలీవుడ్ లో కూడా మంచి పాపులారిటీని సొంతం చేసుకుంది. అక్కడ ఇక్కడ ఆఫర్ల తో దూసుకు పోతున్న మీనాక్షి చౌదరి ప్రస్తుతం పాన్ ఇండియా బిగ్గెస్ట్ మూవీ సలార్ లో నటిస్తున్నట్లుగా సమాచారం అందుతోంది. కీలక పాత్రలో సలార్ సినిమాలో కనిపించబోతున్నట్లుగా తెలుస్తోంది.

# అర్జెంటీనాదే వరల్డ్‌కప్.. గత రికార్డులు ఏం చెబుతున్నాయంటే!



ఖతర్ వేదికగా జరుగుతున్న ఫిఫా వరల్డ్‌కప్ తుది అంకానికి చేరుకుంది. డిసెంబర్ 18(ఆదివారం) ఫ్రాన్స్, అర్జెంటీనా మధ్య జరిగే ఫైనల్‌తో ఈ మెగాటోర్నీ ముగియనుంది.శనివారం మూడోస్థానం కోసం క్రొయేషియా, మొరాకోలు తలపడనున్నాయి. ఇక మెస్సీకి ఇదే ఆఖరి ఫిఫా వరల్డ్‌కప్. అంతేకాదు దేశం తరపున చివరి మ్యాచ్ ఆడనున్నాడు.ఈ నేపథ్యంలో మెస్సీ తన కలను నెరవేర్చుకుంటాడా అనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్స్‌గా బరిలోకి దిగి ఫైనల్లో అడుగుపెట్టిన ఫ్రాన్స్ వరుసగా రెండోసారి కప్ కొట్టాలని భావిస్తోంది. ఫ్రాన్స్ గనుక విజేతగా నిలిస్తే వరుసగా రెండోసారి ఫిఫా వరల్డ్‌కప్ నెగ్గిన మూడో జట్టుగా.. ఇటలీ(1934,1938), బ్రెజిల్(1958,1962) సరసన నిలవనుంది.ఇరుజట్ల ముఖాముఖి పోరులో మాత్రం ఫ్రాన్స్‌పై అర్జెంటీనాదే పైచేయిగా ఉంది.అర్జెంటీనా, ఫ్రాన్స్ టీమ్స్ ఇప్పటి వరకూ 12 అంతర్జాతీయ మ్యాచ్‌లలో తలపడ్డాయి. ఇందులో అర్జెంటీనా ఆరు మ్యాచ్‌లు గెలవడం విశేషం. ఫ్రాన్స్ మూడింట్లోనే విజయం సాధించగా.. మరో మూడు డ్రాగా ముగిశాయి. ఇక ఫిఫా వరల్డ్‌కప్‌లలో ఇప్పటి వరకూ మూడుసార్లు ఈ రెండు టీమ్స్ ఆడాయి. అందులోనూ అర్జెంటీనానే రెండు విజయాలతో పైచేయి సాధించింది.1930లో ఒకసారి 1-0తో, 1978లో 2-1తో ఫ్రాన్స్‌ను అర్జెంటీనా చిత్తు చేసింది. అయితే చివరిసారి 2018 వరల్డ్‌కప్‌లో మాత్రం ప్రీక్వార్టర్స్‌లో ఈ రెండు జట్లు తలపడినప్పుడు మాత్రం ఫ్రాన్స్ 4-3తో అర్జెంటీనాను ఓడించి ఇంటిబాట పట్టేలా చేసింది. ఇది మాత్రం ఫ్రాన్స్‌కు ఊరట కలిగించే విషయం. అయితే గత రికార్డులు చూసుకుంటే మాత్రం ఫ్రాన్స్‌పై పైచేయి సాధించిన అర్జెంటీనాదే ఈసారి ఫిఫా వరల్డ్‌కప్ అని అభిమానులు జోస్యం చెప్పారు.

## టీమిండియాతో తొలి టెస్టు.. బంగ్లాదేశ్ టార్గెట్ 512

తొలి టెస్టులో టీమిండియా బంగ్లాదేశ్ ముందు 512 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. టీమిండియా రెండో ఇన్నింగ్స్‌ను 2 వికెట్ల నష్టానికి 258 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది.టెస్టు స్పెషలిస్ట్ చతేశ్వర్ పుజారా(102 నాటౌట్)తో పాటు ఓపెనర్ శుబ్‌మన్ గిల్(110 పరుగులు) సెంచరీలతో చెలరేగారు.అంతకముందు టీమిండియా బౌలర్ల దాటికి బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగులకు ఆలౌట్ అయింది. ముష్ఫికర్ రహీమ్ 28 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

# దళపతి విజయ్ వస్తాడా రాడా..?

తమిళ హీరోతో సినిమా అది కూడా భారీ బడ్జెట్ తో అనేసరికి ఆ ప్రాజెక్ట్ పై ఎక్కడ లేని అంచనాలు ఉన్నాయి. కోలీవుడ్ స్టార్ దళపతి విజయ్ హీరోగా దిల్ రాజు నిర్మాతగా వారిసు (తెలుగులో వారసుడు) చేశారు. 2023 సంక్రాంతికి రిలీజ్ ఫిక్స్ చేసుకున్న ఈ మూవీని కోలీవుడ్ లోనే కాదు టాలీవుడ్ లో కూడా భారీ స్థాయిలో రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు దిల్ రాజు. ఈ సినిమా విషయంలో థియేటర్ల గొడవ గురించి కూడా తెలిసిందే. వారసుడు సినిమాకు పోటీగా చిరంజీవి వాల్తేరు వీరయ్య బాలకృష్ణ వీర సింహా రెడ్డి వస్తున్నాయి.ఈ మూడు సినిమాలకు సమానంగా థియేటర్ లు కేటాయించాలని నిర్ణయించారు. అయితే తమిళ హీరో సినిమా తెలుగు సీనియర్ స్టార్స్ కి ఈక్వల్ గా థియేటర్స్ ఇవ్వడం పట్ల కొందరు అసంతృప్తి గా ఉన్నారు. నిర్మాత దిల్ రాజు కాబట్టి ఏమి మాట్లాడలేని పరిస్థితి. ఇదిలా ఉంటే ఈ సినిమా కోసం తాను ఇంతగా ఫైట్ చేస్తుంటే విజయ్ మాత్రం తెలుగు రిలీజ్ గురించి పెద్దగా పట్టించుకోవట్లేదని తెలుస్తుంది. విజయ్ సినిమాలు తెలుగులో కూడా రిలీజ్ అవుతూ సక్సెస్ అందుకుంటున్నాయి.కెరీర్ లో మొదటిసారి తెలుగు తమిళ బైలింగ్వల్ మూవీగా చేస్తున్న విజయ్ ఈ సినిమా ప్రమోషన్స్ కోసం అయినా హైదరాబాద్ రావాల్సిందే. ఇంతకుముందు అంటే డబ్బింగ్ సినిమాలు కాబట్టి తెలుగులో ప్రమోషన్స్ కి పెద్దగా ఆసక్తి చూపించలేదు విజయ్. కానీ ఇప్పుడు స్ట్రైట్ తెలుగు రిలీజ్ అన్నట్టు చెబుతున్న వారసుడుకి కూడా విజయ్ రాకపోతే మాత్రం సినిమాపై పెద్ద దెబ్బ పడుతుంది. విజయ్ ని ఎలాగైనా ఒప్పించి హైదరాబాద్ లో ఈవెంట్ కి వచ్చేలా ప్లాన్ చేస్తున్నారు దిల్ రాజు.విజయ్ మాత్రం ఒక ఇంటర్వ్యూ మాత్రమే ఇచ్చి ఈవెంట్స్ కి డుమ్మా కొడదామని అనుకుంటున్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190